ప్రజాశక్తి ఆదివారం అనుబంధం

జూన్ 15, 2008

కథా నిలయం
శ్రీకాకుళం



శ్వేతసౌధంలో మేఘశ్యాముడా!

హ్యాపీ బర్త్‌డే

(2008 జూన్-15 నుంచి-2008 జూన్-21వరకు)

ఎస్. చిన్ను
2సం॥, జూన్-2006
శోభ-నర్సింహ
దిల్‌షుక్‌నగర్-హైదరాబాద్

ఎస్. షాహిస్తా
జూన్-16
షహీదా-షయ్యద్ హమీద్ హుస్సేన్
కడప

బి. సన్ని(హేమంత్)
5సం॥, జూన్-2003
రాణి-రాములు
మారెపల్లి-మ॥నగర్

ఎన్. ప్రవల్లిక
3సం॥, జూన్-15
రజని-కృష్ణ
హైదరాబాద్

కె. హిమవర్షిణి
జూన్-17
సత్యవతి-శ్రీనివాసరావు
శ్రీకాకుళం

వి. దినేష్(చింటు)
4సం॥, జూన్-2004
సత్యవతి-వెంకట్రావు
గోవిందాపురం-ఖమ్మం



...మన ఇంటినుంచే మొదలవ్వాలి

మన అతిథి

పేరు	:	యు. వాసుకి
పుట్టిన తేదీ	:	21.1.1958, తిరుచ్చిరాపల్లి
తల్లిదండ్రులు	:	ఉమానాథ్, పాపా ఉమానాథ్
విద్య	:	బి.కామ్.
బాధ్యత	:	ఐద్వా (అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం) రాష్ట్ర కార్యదర్శి, తమిళనాడు
హాబీ	:	చదవడం
ఇష్టమైనది	:	ఎక్కువమంది మహిళలు ఒక చోట చేరి మాట్లాడుకోవడం
ఇష్టంలేనిది	:	అసాధ్యం అన్న పదం
రోల్ మోడల్	:	అమ్మే

మర్చిపోలేని సంఘటన : 1968వ సంవత్సరంలో కీళ వెన్మని గ్రామంలో ఒక సంఘటన జరిగింది. అక్కడి వ్యవసాయ కార్మికులు తమకు కూలిరేటు పెంచమని భూస్వాములను అడుగుతున్నారు. వారు తిరస్కరిస్తున్నారు. అంతటితో కార్మికులు వదిలిపెట్టలేదు. భూస్వాములమీద ఒత్తిడి పెంచారు. అలా లాభంలేదనుకొన్న భూస్వాములు ఒక సంఘంగా ఏర్పడ్డారు. గ్రామంలో రెపరెపలాడుతున్న ఎర్రజండాను దించి తమ జండాను ఎగరవేయడానికి ప్రయత్నించగా కార్మికులు అడ్డుకున్నారు. భూస్వాముల మనుషులు వారిని ఒక ఇంట్లో బంధించి సజీవ దహనం చేశారు. ఆ మారణకాండలో 44 మంది మహిళలు, పిల్లలు అసువులుబాశారు. అణగారిన వర్గాల వారిపై సాగిన ఈ సామూహిక నరమేధం దేశాన్ని అట్టుడికించింది. అది ఇప్పటికీ మర్చిపోలేను.

పాల్గొన్న ప్రముఖ ఉద్యమం : కోకో కోలా కంపెనీ శివగంగలోని భూగర్భజలాలను విచ్చలవిడిగా వాడుకునేది. దానికి వ్యతిరేకంగా ఎన్నో చిన్నచిన్న ఉద్యమాలు చేసినా ఫలితం లేకపోయింది. దాంతో ఓరోజు పదివేలమందితో ఒక ప్రదర్శన చేశాం. దానికి నేనే నాయకత్వం వహిస్తున్నా. నాతో సహా రెండువేల మందిమీద ఒకే ఎఫ్ ఐ ఆర్ రాశారు పోలీసులు. అయినా పోరాటం ఆపలేదు. ఎట్టకేలకు కోకోకోలా వారు శివగంగ వదిలి వెళ్లిపోయారు.

కుటుంబంలో, సమాజంలో మహిళల పాత్రను, కష్టాన్ని గుర్తించాలి. మహిళల పట్ల వివక్ష తగదు. వారిని కూడా మగవారితో సమానంగా చూడాలి. ఇది ముందుగా మన ఇంటి నుంచే మొదలవ్వాలి. మన చుట్టూ వున్న సమాజంలో మొదట ఇదంతా జరుగుతుందిలెమ్మని ఎదురు చూస్తుండకూడదు. అసమానతలు, లింగవివక్ష, హింస లేని లౌకిక, ప్రజాస్వామిక సమాజం రావాలి.

U. Vasuki

ఈ సంచికలో....

టపా	...	2
సీరియల్	...	8
సినిమా	...	10
బాలనేస్తాలు	...	12
అట్టమీది కథ	...	14
ఆరోగ్యం	...	17
విజ్ఞాన వీచిక	...	18
లాహిరి లాహిరి	...	20
మనసా... తెలుసా	...	22
రుచి	...	23
కొత్త పుస్తకాలు	...	24

ఇంకా...

మంచిపుస్తకం ...6

రాజీవ్ హత్యలో రాక్షస వ్యూహాలు



చూద్దామా... 3

ప్రకృతి సోయగాల చిరపుంజి

కథ ... 4

నాన్నా నన్ను క్షమించు



అచ్చం అమ్మాయే

కొత్త అనుభూతులు కల్గించే "సాత్పుర" దర్శించకలిగి ఉండాలి. నరేష్ స్త్రీ వేషంలో అచ్చం అమ్మాయిలాగే ఉన్నాడు. బచేంద్రీపాల్‌లా ఎవరెస్ట్ ఎక్కడం అంత సులభం కాదు. కష్టమే. "బ్రెడ్ రోస్ట్" భేషుగ్గా ఉంటుంది. స్వేచ్ఛ కోసం పోరాడిన అంబేద్కర్ ధన్యుడు. వారి ఆదర్శాలు ఆచరణీయాలు. వారి గురించిన పుస్తకాన్ని పరిచయం చేసినందుకు చాలా సంతోషం.

– వాస్తు రామచంద్ర, రాంజీనగర్, నెల్లూరు.

మంచి కథలు ఇవ్వొచ్చుకదా...

స్నేహలో మంచి కథలు ఇస్తే ముందుగా సంతోషించేది మేమే. ఎందుకంటే మాకు కథలంటే చాలా ఇష్టం. అందునా ప్రజాశక్తిలో ఇస్తే మేం ఎంతో సంతోషిస్తాం. బాలల కథ కూడా పిల్లలను ఆకట్టుకునేలా వుంటోంది. వారం వారం అందిస్తున్న మంచిపుస్తకం కూడా విడిచిపెట్టకుండా చదువుతున్నాం. పుస్తకం కొని చదవగలిగే స్తోమతు లేకపోయినా కనీసం దాని గురించి ఇచ్చిన విషయాలనైనా తెలుసుకోగలుగుతున్నాం. అంత వరకైనా ధన్యులమవుతున్నాం. అందుకు మీ అందరికీ రుణపడివుంటాం.

మణికంఠ, విజయవాడ-2.

అనేక అంశాలు తెలిశాయి

పీడిత, అణగారిన ప్రజల కొరకు నిజాయితీగా పోరాడిన అంబేద్కర్ గురించిన పుస్తక పరిచయం బాగుంది. ఆదేశిక సూత్రాలను రూపొందించారు. వాటి ఆధారంగా ఆర్థిక ప్రజాస్వామ్యాన్ని సాధించమన్నారు. అస్పృశ్యత, అంటరానితనం నిర్మూలన కొరకు దృఢమైన చిత్తశుద్ధితో పోరాడిన యోధుడు ఆయన. ప్రపంచలోకెల్ల అత్యున్నత పర్వతం ఎవరెస్ట్ గురించి కవర్ పేజీ వ్యాసం విజ్ఞానదాయకంగా వుంది. ఈ పుస్తకం ద్వారా అనేక అంశాలు తెలుసుకుంటున్నాం.

– ఎ. శ్రీరామ్మూర్తి, గాజువాక, విశాఖ.

నోరూరించిన సొరకాయ అట్లు

ప్రజాశక్తి దినపత్రిక జూన్ 1, 2008 నాటి ఆదివారం అనుబంధం పరిధవిల్లిన భావసుగంధాన్ని పాఠకుల మస్తిష్కాల నిండా వెదజల్లింది. అతి స్వల్పధరలో అనల్పమైన శీర్షికలతో ప్రతీ ఆదివారం అనుబంధం "స్నేహ" అనిర్వచనీయమైన అనుభూతిని మా గుండె గదులనిండా నింపుతూ, ఆబాలగోపాలాన్ని ఆనందింపజేస్తున్నందుకు మనసా వాచా ఎంతో అభినందిస్తున్నాం. సమాచార ఖజానా మేధస్సుకు నజరానా మాటల్లో నిర్వచించ లేనంత బాగున్నాయి. బాలల అభిరుచిపట్ల మీరు తీసుకుంటున్న ప్రత్యేక శ్రద్ధకు హ్యాట్సాఫ్..! అయితే సెంటర్ స్ప్రెడ్‌లో వర్ణచిత్రాలు వేస్తే మరింతమంది పిల్లలు ఆకర్షితులవుతారు. రేడియో కవర్ స్టోరీ ఆద్యంతం భలే థ్రిల్లింగ్‌గా ఉంది. రేడియో మార్కోనీగారి మేధాశక్తి అద్భుతం!! కీలుగుర్రం సినీకత బాగుంది. సొరకాయ అట్లు గూర్చి చదువుతుంటే లాలాజలం ఊరింది.

– ఎం.సత్యనారాయణ, పొందూరు, శ్రీకాకుళం.

నరేష్ కబుర్లు బాగున్నాయి

సినీ నటుడు నరేష్ చెప్పిన కబుర్లు బావున్నాయి. ఆయన ఎన్నో విషయాలను తెలిపారు. అదే విధంగా ఒక ప్రొడ్యూసర్ ఆయన్ను చూసి నిజంగా అమ్మాయే అనుకున్న తీరు చదివి మేం చాలా ఆశ్చర్యపోయాం. నిజంగా ఆయనకు ఆ పాత్ర బాగా సూటయ్యింది. ఇలాగే మరింత మంది సినీతారల కబుర్లను అందించాలని చందుగారిని కోరుకుంటున్నాం. బాలల కథలు బాగుంటున్నాయి. రంగుల పేజీల పట్ల పిల్లలు బాగా ఆకర్షితులవుతున్నారు. పిల్లలకోసం రంగుల్లో రెండు పేజీలు ఇస్తున్నందుకు చాలా సంతోషం.

ఆర్. వనజ, రేపల్లె.

పసందైన కవర్

జూన్ మొదటి ఆదివారం "స్నేహ" అట్టమీదికథగా "భలే భలే రేడియో బంగారు రేడియో" పసందుగా ఉంది. ఎన్ని

ప్రసార, ప్రచార మాధ్యమాలు వెల్లువెత్తినా నీడలా వెన్నంటి ఉండే సత్తా ఉన్న రేడియో ప్రతిభ ఎన్నటికీ తరగనిది. ఎఫ్.ఎమ్. పుణ్యమాని రేడియో అభిమానులు పెరిగిపోవటం హర్షణీయ పరిణామం. నీటిగుర్రానికి 'జెస్సికా' అని ముద్దుపేరు పెట్టుకుని మరీ నట్టింట్లో పెట్టుకుని మురిపెంగా పెంచుకుంటున్న టోనీ దంపతులను అభినందించాల్సిందే..! విజ్ఞాన వీచికలో అంగారక గ్రహం గురించి అవగాహన చేసుకున్నాం. "ఆరోగ్యకరమైనర ఆహారం" అంటూ డాక్టర్ నరసింహారావుగారందించిన సూచనలు, ఆరోగ్య ప్రధానమైన సలహాలు అక్షరలక్షల విలువ చేసే విధంగా ఉన్నాయి. రైతుల స్థితిగతులను బాగుపరచడానికి మనందరం అంకురిత దీక్షపూనాలని అభివ్యక్తీకరించిన మన అతిథి పోలి రాఘవరెడ్డి గారితో శృతి కలుపుతున్నాం. "వీరివీరి గుమ్మడి పండు వీరి పేరేమి?" జవాబు... అదే సంచికలో ఇవ్వకుండా పాఠకుల నుండి జవాబు రాబట్టేట్టు మార్చండి.

– నేమాన సుభాష్ చంద్రబోస్, ఇలిసిపురం జంక్షన్, శ్రీకాకుళం.

ఆహ్వానం

మీరు జోక్స్ బాగా వేస్తారా! వాటిని విన్న మీ స్నేహితులు, సహోద్యోగులు, ఇరుగు పొరుగు పడీపడీ నవ్వుతారా! మరైతే ఇంకా ఆలోచిస్తున్నారేంటండీ బాబూ. మా పాఠకులను కూడా మీ జోక్స్‌తో కడుపుబ్బా నవ్వించండి. గిలిగింతలు పెట్టండి. మీరు రుచి కరమైన వంటలు, అల్పాహారాలు, పానీయాలు... చేస్తుంటారా. వెజ్, నాన్ వెజ్ కూరలు వెరైటీగా చేస్తుం టారా. వెంటనే ఓ కాగితం, పెన్నూ తీసుకోండి. మీరు మాకు పంపదల చుకున్న వంటకానికి కావాల్సిన పదార్థాలు, కొలతలు, వండే విధానం వివరంగా రాసి మాకు పంపండి. ప్రచురిస్తాం.

మా చిరునామా: ఆదివారం అనుబంధం, ప్రజాశక్తి, స్ట్రీట్ నెం.1, అశోక్‌నగర్, హైదరాబాద్-20.

కథా నిలయం
శ్రీకాకుళం

చూద్దామా...

జావేద్

ప్రకృతి సోయగాల చిరపుంజి



ఆకుపచ్చని గుబుర్లలో అరవిరిసిన పుష్ప సోయగాలు... అందచందాల గరిక మైదానాలు... జలపాతాల ఝుంకార నాదములు... ఝరీ సంగీత మధుర గానములు... సెలయేటి గలగలలు... పక్షుల కిలకిల రావాలు... వంపుసొంపుల నదీనదాలు... భూమిని ముద్దాడుతున్న నీలిమేఘాలు... ఒకటేమిటి అక్కడ పరవళ్లు తొక్కుతున్న ప్రకృతి అందాలన్నీ ఇట్టే పరవశింపజేస్తాయి. ఒక్కసారి చూస్తే... మళ్లీ మళ్లీ చూడాలనిపించేలా చేస్తాయి. అందరినీ అలరించే ఆ అందమైన ప్రదేశమేదో తెలుసా? మేఘాలయ రాజధాని షిల్లాంగ్ నగరానికి 50 కిలోమీటర్ల దూరంలో ఉన్న 'చిరపుంజి'. ఆ అందాల సీమలో విహరించాలనీ, ఆ ఆహ్లాదకరమైన వాతావరణాన్ని ఆస్వాదించాలనీ దేశవిదేశాల నుంచి పర్యాటకులు వస్తుంటారు. తల్చుకుంటే చాలు ఆ ప్రదేశాన్ని చూడాలనిపిస్తుంది కదూ! అచ్చం అలాంటి అనుభూతిని కలిగించే విశేషాలు మీకోసం...

'చిరపుంజి' అనగానే అత్యధిక వర్షపాతం నమోదయ్యే ప్రాంతంగా అందరికీ తెలిసిందే. అత్యధిక వర్షపాతం కలిగిన ప్రదేశంగా ప్రపంచంలోనే ప్రసిద్ధికెక్కిందది. 2002లో 12,262 మి.మీ. వర్షం కురిసి, ప్రపంచ పర్యావరణ నిపుణులనే అబ్బుర పరచిన ఘనత దానిదే. ఎప్పుడూ 470 అంగుళాల వర్షపాతం కలిగి ఉండడం దాని ప్రత్యేకత. అత్యధిక వర్షపాతం నమోదవుతున్నా అక్కడెలాంటి ప్రమాదాలూ, ప్రకృతి వైపరీత్యాలూ సంభవించవు. కారణం... ఆ ప్రదేశం ఎంతో ఎత్తున ఉండటమే.

జాలువారే జలపాతాలు

చిరపుంజిలోనే ఎందుకంత వర్షపాతం నమోదవుతుందంటే... అది ప్రకృతి సిద్ధమైనదని చెప్పక తప్పదు. వాతావరణంలో ఉండే వాయువులే అందుకు కారణమని పర్యావరణవేత్తలు తేల్చారు. అదెలాగంటే... బ్రహ్మపుత్ర లోయమీదుగా వీచే గాలులు, మేఘాలయ మీదుగా వీచే గాలులు కాశీపర్వతాల మీద కలసిపోతాయి. వాటి కలయికవల్ల అత్యధిక వర్షం కురుస్తుంది. కాశీపర్వత శ్రేణికి దగ్గర్లోనే చిరపుంజి ఉంది గనక ఆ వర్షపాతమే అక్కడా నమోదవుతుంది. అక్కడ నవంబర్ నుంచీ ఫిబ్రవరి వరకు ఒక మోస్తరు వర్షం కురుస్తుంది. జూన్ నుంచీ ఆగష్టు వరకు మాత్రం 300 అంగుళాల మేరకు కురుస్తుంది. సహజంగానే శిఖర సముదాయమైన చిరపుంజిలో నీరు ఎత్తయిన ప్రాంతం నుంచి కిందికి జారడంవల్ల ఎలాంటి వర్షాఘాతమూ కలగదు. జాలువారుతున్న జల ప్రవాహాలు, జలపాతాలుగానూ, సెలయేళ్లుగానూ, వాగులూ వంకలుగానూ, నదీనదాలుగానూ, జలాశయాలుగానూ ప్రకృతి ఒడిలో శోభిల్లుతున్నాయి.

ప్రకృతి సౌందర్యానికి ప్రతీక

వర్షపాతంలోనే కాదు, ప్రకృతి సౌందర్యానికీ ప్రతీక చిరపుంజి. అక్కడ నేలమీద పవళిస్తున్న ఏనుగుల గుంపును తలపించే పర్వతాకృతులు వీక్షకులను ఆకట్టుకుంటాయి. కొండల నుంచి దూకే జలపాతాల గలగలలూ, వాటి అంచున చేరి, అందాలారబోసే నాట్యమయూరాలూ వీనసొంపుగానూ, కనువిందుగానూ ఉంటాయి. మలుపు సొంపుల సెలయేటి భంగిమలూ, యేటి గట్టున చెట్లమీద రకరకాల పక్షుల మధుర కూజితములూ మధురానుభూతిని కలిగిస్తాయి. నీలాల నింగిని ముద్దాడుతున్న శిఖర సముదాయాలూ, ఆకుపచ్చని గుబుర్లూ, అరవిరిసిన పుష్పసౌరభాలూ, అల్లుకుపోయిన లతలూ ఆకట్టుకుంటాయి.

చూడచక్కని కొండలు

బయటికి చిన్నగా కనిపించే సున్నపు కొండలు లోపలికెళ్లేకొద్దీ పెద్దవిగా కనిపిస్తాయి. చూపరులను ఆశ్చర్యపరుస్తాయి. కొండలోయల్లో నిండుగా కనిపించే జలాశయాలూ, వాటిమీద తేలియాడే నీటిమొక్కలూ నయన మనోహరంగా ఉంటాయి. అక్కడి జలాశయాల్లో స్నానం చేస్తే ఎలాంటి శారీరక రుగ్మతలయినా తొలగిపోతాయని కొండజాతీయుల నమ్మకం. వాటిని ఔషధీ తటాకములని కూడా పిలుస్తారు. కొండగుహల్లో కొన్ని చోట్ల చీకటీ, మరికొన్ని చోట్ల వెలుగూ కనిపిస్తుంది. తగినంత వర్షపాతం, అందుకు తగ్గ సూర్యరశ్మీ లభిస్తుండడంవల్ల అక్కడి వాతావరణమెప్పుడూ అహ్లాదంగానే ఉంటుంది. పచ్చని చెట్లూ, గరికపచ్చ మైదానాలూ, ఎగుడూ దిగుడు ప్రదేశాలూ, కొండలూ కోనలూ లాంటి ప్రకృతి అందాలూ సహజంగానే ఏర్పడ్డాయక్కడ. మొత్తం మూడువందల రకాల వృక్షసంపద ఇక్కడుందనీ, ఔషధ గుణం కలిగినవి మరెన్నో ఉన్నాయనీ ఆయుర్వేద, పరిశోధక నిపుణులంటారు. వాటిని స్పృశిస్తూ వీచే చల్లని గాలిని పీల్చడంవల్ల ఎలాంటి రోగమైనా మటుమాయమౌతుందని పలువురి నమ్మకం. మిట్ట మధ్యాహ్నపు వేళలో, నిశ్శబ్దపు వాతావరణంలో కొండలపై నుంచీ, జలశయాలపైనుంచీ వీచే మలయమారుతాలూ, వాటిని స్వాగతిస్తున్నట్లు తలలూపే వృక్షరాజాలూ, కీరవాణి రాగంలా మైమరిపించే జలపాతాల ఝుంకార నాదములూ చూపరులను ముగ్ధుల్ని చేస్తాయి. ఆనందపారవశ్యంలో ఓలలాడిస్తాయి.

ఎలా వెళ్లాలంటే...

గౌహతి నుంచి చిరపుంజి 128 కిలోమీటర్ల దూరంలో ఉంటుంది. రైలు మార్గంలో అయితే చిరపుంజికి 56 కిలోమీటర్ల దూరంలో ఉన్న షిల్లాంగ్ వరకు చేరుకోవచ్చు. ఇక్కడి నుంచి ఆ ప్రాంతానికి ఆటోలూ, టాక్సీలూ, ప్రయివేటు వాహనాలూ ఉంటాయి. ఒకవేళ బస చేయాలనుకునేవారు షిల్లాంగ్‌లోనే చేయాలి. అక్కడ హోటల్ పోలో టవర్స్, హోటల్ బ్రాడ్‌వే, బాబా టూరిస్ట్ లాడ్జ్ లాంటి సౌకర్యవంతమైన ప్రదేశాలుంటాయి. 150 నుంచీ 800 రూపాయలలోపు అన్ని సదుపాయాలూ కలిగిన సింగిల్, డబుల్ రూమ్‌లు లభిస్తాయి. అక్కడ బస చేస్తూ దగ్గర్లోనే ఉన్న చిరపుంజికి వెళ్లిరావచ్చు. ❄

కథ

నాన్నా నన్ను క్షమించు...

సూరిపండు

"అవును. ఎంతటి వాస్తవాన్ని ఆ తేలిక పాటి పదాల్లో నింపి జనానికి హెచ్చరిక విన్పిస్తున్నాడు కవి! ఆ మాటల్లోని నిజాన్ని అర్థం చేసుకునే వాళ్ళెంత మంది? అర్థం చేసుకున్నా ఆచరణలో పెట్టే వాళ్ళెంత మంది? తనూ ఆ ఆచరణ శూన్యుల్లో ఒకడు కాదూ! తనూ.... తన అన్నగారూ కన్న తండ్రిని నిరాశకూ... నిరాదరణకూ గురి చేసిన వాళ్ళే. తమ అడుగు జాడల్లోనే నడుస్తున్నాడు తన కొడుకూ! ఆలోచనలు ఒకదాని వెంట మరొకటిగా మెదులుతుండగా గతంలోకి జారిపోయాడు రామనాథం.



నోటికి చెయ్యి అడ్డుపెట్టుకొని తెరలు తెరలుగా వస్తున్న దగ్గుని ఆపుకోవడానికి ప్రయత్నించాడు. పాడు దగ్గు. పది రోజులుగా పట్టి పీడిస్తోంది. చెప్పగా.. చెప్పగా నాలుగు రోజుల క్రితం ఏవో నాలుగు మందు బిళ్ళలు పట్టుకొచ్చి పడేశాడు. అవి వేసుకున్నప్పుడు కాస్తంత అదుపులో ఉండేది. తర్వాత మామూలే! "ఎలా వుంది నాన్నా" అని అడుగుతాడేమో కొడుకు అని ఎదురు చూశాడు తను ఈ రెండు రోజులూ. తన కళ్ళ ముందు నుంచే ఆఫీసుకు వెళ్తున్నాడు. బయట నుంచి వస్తూ ఇంట్లోకి వెళ్తున్నాడు. తనవైపు కనీసం తల కూడా తిప్పడం లేదు. ఈ రోజు ఉదయం తనే అడిగాడు నోరు తెరిచి. "బాబూ... దగ్గు ప్రాణాల్ని నులిమేస్తోందిరా. ఎవరైనా డాక్టరుకి చూపిస్తే బాగుండు" అని.

చిరాకుపడుతూ చూశాడు తన వంక కొడుకు. "ఏంటి నాన్నా! దగ్గు, రొంపలకి కూడా డాక్టర్లంటూ తిరిగితే మనం ఎక్కడ తట్టుకోగలం. రోగుల మీద వ్యాపారాలు చేస్తున్నారు డాక్టర్లు. మీ కాలంలో ఏవో కషాయాలూ గట్రా తాగేటోళ్ళు కదా. నీ కోడలికి చెప్పి కాస్త కషాయం చేయించుకుని తాగు. అదే తగ్గుతుంది" అని చెప్పి చక్కాపోయాడు.

చేసేది లేక "ఆ కషాయమేదో కలిపియ్యమ్మా..." అంటే "ఆఁ... కషాయాలూ, గిషాయాలూ కలిపిచ్చే ఓపిక నాకు లేదు. ఈ కరక్కాయ ముక్క నోట్లో పడేసుకొని చప్పరించండి" అంటూ ఇంత కరక్కాయ మీదకి గిరాటు వేసింది. దాన్నే సగం ముక్క చేసి చప్పరిస్తూ కూర్చున్నాడు పొద్దుట నుంచీ. మళ్ళీ దగ్గు తెర రావడంతో కోడలు విసుక్కుంటోంది.

మంచం పక్కనే స్టూలు మీదున్న చెంబు అందుకొని కాసిని మంచినీళ్ళు గొంతులో పోసుకున్నాడు. కాస్త ప్రాణం లేచి వచ్చినట్టయింది. చెంబు మళ్ళీ స్టూలు మీద పెట్టి పొద్దుట తలగడ కింద పెట్టిన సగం కరక్కాయ ముక్కని నోట్లో వేసుకొని చప్పరించసాగాడు రామనాథం. మంచం మీద పడుకున్నాడన్న మాటేగాని కంటి మీదకి కునుకు రావడంలేదు.

"ఎలా వస్తుంది? మనసు నిండా ఆలోచనలు సుళ్ళు తిరుగుతుంటే!"

కొడుకు బ్రహ్మానందం అంటే తనకి ఎనలేని ప్రేమ. తన సర్వస్వం వాడేనని, తన ఆశల... ఆశయాల ప్రతిరూపం వాడేనని అల్లారు ముద్దుగా పెంచుకున్నాడు. వాడి చిన్న తనంలోనే ఏదో జబ్బుతో తల్లి చనిపోతే తల్లీ తండ్రీ తానే అయి పెంచాడు. "అమ్మా... అమ్మా" అని ఏడ్చే పసివాణ్ణి గుండెల మీద వేసుకొని లాలించాడు. సవతి తల్లి వాణ్ణి ఎక్కడ నిరాదరిస్తుందోనని... తన యవ్వనాన్ని, తన సుఖాల్ని వాడికోసం మర్చిపోయి ప్రేమగా పెంచుకున్నాడు. తన తాహతుకు మించి చదువులు చెప్పించాడు. మంచి ఉద్యోగమూ వచ్చింది. ఆ వెనుకనే అందచందాలతోపాటుగా ఆస్థి పాస్తులున్న భార్యా వచ్చింది.

వాడి నీడన హాయిగా తన శేష జీవితం వెళ్ళిపోతుందనుకున్నాడు. "కృష్ణా.. రామా.." అనుకుంటూ ప్రశాంతంగా రోజులు గడపవచ్చనుకున్నాడు. వయసు పైబడిన ఈ సమయంలో రోగాలు కాక మరేమొస్తాయి. ఎలా మొదలైందో.. చిన్నగా ప్రవేశించి ఏకు మేకైనట్టు విపరీతమై పట్టి పీడిస్తోంది ఈ దగ్గు. కోడలూ చూడదు. కొడుకు సరే సరి. ఉద్యోగమో... వ్యాపారమో" అంటూ రాత్రింబగళ్ళు తేడా లేకుండా తిరుగుతుంటాడు. తనను పట్టించుకొనే తీరిక వాడికి లేదు. ఆవిడకి ఓపికలేదు. ఒంటరి తనం. నిర్లిప్తంగా రోజులు గడపడం తప్ప తను చేయగల్గిందేముంది.

రోజూ ఉదయం పూట భిక్షకొచ్చే దాసరి వెంకన్న పాడే తత్వం గుర్తొచ్చి తాత్వికంగా నవ్వుకున్నాడు. అదేమి విచిత్రమో ప్రతి రోజూ తమ ఇంటి ముందు నిలిచి అదే తత్వం పాడుతాడు తంబుర మీటుతూ "ఎవరు చేసిన కర్మ వారనుభవించకా.... ఎవరికైనను తప్పదే చిలకా..." అంటూ.

"అవును. ఎంతటి వాస్తవాన్ని ఆ తేలిక పాటి పదాల్లో నింపి జనానికి హెచ్చరిక విన్పిస్తున్నాడు కవి! ఆ మాటల్లోని నిజాన్ని అర్థం చేసుకునే వాళ్ళెంత మంది? అర్థం చేసుకున్నా ఆచరణలో పెట్టే వాళ్ళెంత మంది? తనూ ఆ ఆచరణ శూన్యుల్లో ఒకడు కాదూ! తనూ.... తన అన్నగారూ కన్న తండ్రిని నిరాశకూ... నిరాదరణకూ గురి చేసిన వాళ్ళే. తమ అడుగు జాడల్లోనే నడుస్తున్నాడు తన కొడుకూ! ఆలోచనలు ఒకదాని వెంట మరొకటిగా మెదులుతుండగా గతంలోకి జారిపోయాడు రామనాథం.

తాను నేల తల్లినే నమ్ముకొని పల్లె పట్టునే ఉండి పోయినా తాత గారి కోరిక మేరకు అన్నదమ్ములిద్దరికీ చదువులు బాగానే చెప్పించాడు తమ తండ్రి. అన్నయ్య సోమనాథం చదువుల్లో బాగా ముందంజలో వుండి

డాక్టరయ్యాడు. తాను వెనకబడి మామూలు డిగ్రీతోనే సరిపెట్టాడు. డాక్టరయ్యాక తమ పల్లెలోనే ప్రాక్టీసు పెడతాడని ఎంతగానో ఆశ పడ్డాడు తమ తండ్రి.

"ఇక ఊళ్ళో ఎవరికేం వచ్చినా ఆయాస పడుతూ ఆ పట్నం దిశగా పరుగెత్తక్కర్లేదు" అంటూ ఊళ్ళో అందరితోనూ చెప్పేవాడు. హాస్పిటల్ పెట్టడానికి కావలసిన ఏర్పాట్లు చెయ్యడానికి తనే కదిపాడు ఒకనాడు "మరి ఓ మంచిరోజు చూసి ఆస్పత్రి ప్రారంభిస్తే బాగుంటుందిగా అబ్బాయ్" అని.

ఫెళ్ళుమని నవ్వాడు అన్నయ్య నాన్న మాటలకి.

"ఏమిటి నాన్నా! నువ్వు మరీ ఇలా ఆలోచిస్తావనుకోలేదు. ఇంత ఖర్చు పెట్టి డాక్టర్ చదివి ఈ పల్లెటూళ్ళోనా ప్రాక్టీస్ పెట్టేది. చిల్లర డబ్బులు ఏరుకోవడం తప్ప ఏం గిట్టుబాటవుతుంది. అదే ఫారిన్‌లో అయితే డాలర్ల వర్షం కురుస్తుంది" పూర్తి వ్యాపారాత్మకంగా మాట్లాడుతున్న కొడుకును ఎలా తన దారికి మళ్ళించాలో ఆయనకు అర్థం కాలేదు.

"అది కాదురా... తాతయ్య పట్టు బట్టి డాక్టర్ చదివించమన్నది ఈ పల్లె ప్రజలకి సేవ చెయాలని. డబ్బుకి మనకేం కొదవ వచ్చిందిరా. నా తండ్రి నాకు యిచ్చిన అయిదెకరాల చెక్కని పది ఎకరాలు చేశాను. మీరిద్దరూ కూర్చుని తిన్నా ఏలోటూ రాదు. పట్టణాలంతకాకపోయినా ఇక్కడ కూడా సంపాదనకేమీ తక్కువ కాదు. మమతానురాగాలు మర్చిపోయి కన్న వాళ్ళనీ, ఉన్న ఊరునీ వదిలి ఏ దూర దేశాలకో ఎగిరిపోవడం ఏం న్యాయమో ఆలోచించు" అన్నారు నాన్న.

"ఆలోచించే చెప్తున్నాను నాన్నా. మారుతున్న కాలంలో మానవతా విలువలకు విలువ లేకుండా పోతున్నదని నీకు తెలియదా. ప్రస్తుతం ప్రపంచమంతా డబ్బు చుట్టూనే తిరుగుతోంది. డబ్బు సంపాదించగలిగినవాడికే లోకం విలువనిస్తోంది. గౌరవంగా చూస్తోంది. కట్టుకున్న భార్య అయినా, కన్న బిడ్డలయినా ఎంత సంపాదిస్తున్నాడు అని చూస్తున్న రోజులివి. అవకాశం లేనివాడికెలాగూలేదు. ఉన్న నాలాంటి వాళ్ళనిలా వెనక్కి లాగడం సరికాదు. జెడ్.పి.ఛైర్మన్ గారి అమ్మాయి, నేనూ ప్రేమించుకున్నాం. పెళ్ళి చేసుకోవాలని నిర్ణయించుకున్నాం. మా యిద్దర్నీ స్టేట్స్‌కి పంపించడానికి ఆయన అన్ని ఏర్పాట్లూ చేస్తున్నారు. త్వరలోనే ముహూర్తాలు కూడా నిర్ణయిస్తారు. పెద్దవాళ్ళుగా ఆశీర్వదించి మీ పెద్దరికం నిలబెట్టుకోండి" ఇంక చెప్పేదేమీ లేదన్నట్టుగా అక్కణ్ణుంచి వెళ్ళిపోయాడు అన్నయ్య.

నిరుత్తరుడైన నాన్ననలా వదిలేసి, అన్నట్టుగానే అతి తొందరలోనే అమెరికాకి ఎగిరి పోయారు జంట పక్షుల్లా అన్నయ్యా, వదిన. అప్పుడప్పుడు "ఇక్కడ మేము క్షేమం. మీరు కుశలమని తలుస్తాను" అంటూ రెండు ముక్కల్తో ఉత్తరాలు రాసేవాడు. నానమ్మ తాతయ్యలు కాలం చేసినపుడు కూడా ఆ ఉత్తరాల తోనే సరి పెట్టాడు. ఆ తర్వాతర్వాత అవీ సన్నగిల్లాయి.

అన్నయ్య అలా అయితే... తను గ్రామ రాజకీయాల్లో పాల్గొంటూ జిల్లాస్థాయికి ఎదిగాడు. ఓ రాజకీయ నాయకుడి ఇంటి అల్లుడయ్యాడు.

"ఈ పల్లెటూళ్ళో ఉంటే ఎదుగూ బొదుగూ ఉండదు. పట్టణంలో మకాం పెడితే రాజకీయాల్లో ముందుకు సాగిపోనూ వచ్చు. ఏదైనా వ్యాపారమూ చేసుకోవచ్చు" అంటూ మకాం పట్టణానికి మార్చేశాడు. మామగారితో కలిసి వ్యాపారమూ ప్రారంభించాడు. పల్లె వదలి రాని తల్లిదండ్రులను ఏ నెలకో, రెండు నెలలకో ఒక మారు చుట్టం చూపుగా పోయి పలకరించివచ్చేవాడు.

ఒక రోజు హఠాత్తుగా తండ్రి దగ్గర్నుంచి కబురు వచ్చింది తల్లి చనిపోయిందని. ఎలక్షన్ల హడావిడి మంచి జోరుగా వుంది. ఈ ఎన్నికల పైనే తన రాజకీయ భవిష్యత్తు ఆధారపడి ఉంది. వెళ్ళకపోతే నలుగురూ నాలుగు రకాలుగా అంటారని మావగారు చెప్పడంతో సాయం కాలానికి చేరుకున్నాడు తల్లి రుణం తీర్చుకోవడానికి. అన్నగారికి ఫోన్ చేసి చెప్పాడు తనే. మళ్ళీ ఫోన్ చేస్తానని పెట్టేశాడు అన్నయ్య. తను బయలుదేరడానికి ముందే "సెలవు దొరకని కారణంగా రాలేక పోతున్నానని, అమ్మ చనిపోయినందుకు చాలా బాధపడుతున్నానని, నాన్నగారి ఆరోగ్యం జాగ్రత్త అని" ఫోన్‌లో చెప్పాడు. ఆ మాటలే తండ్రికి చెప్పాడు తను. ఆయన పడిన ఆవేదనను ఆ రోజు గుర్తించలేకపోయాడు తను.

"ఆశ మనిషిని ఎంత పతనావస్థకు తీసుకు వెళ్తుంది. ఎంత

"వీటన్నిటికీ ఆ ముసలాడే కారణం. శుభమా అంటూ ఏ మంచి పని చేద్దామన్నా "వద్దు, వద్దు" అంటూ అపశకునం మాటలే. అంటూ తన భార్య నానా మాటలూ అంది తండ్రిని. తను కూడా ఆమెనే సమర్థించి తండ్రిని చూడడానికి కూడా వెళ్ళడం మానుకున్నాడు. చివరికి ఒంట్లో శక్తి ఉడిగి మంచాన పడ్డాడన్నా వెళ్ళలేదు. "ఒక్కసారి వచ్చిపోరా" అని ఎన్నిసార్లు కబుర్లు పంపినా ఆయన బ్రతికి ఉండగా ఒక్కసారి కూడా వెళ్ళలేదు.

సంపాదించి ప్రయోజనమేముంది. డాలర్లు తింటామా... పోయినప్పుడు వెంట బెట్టుకొని పోతామా.. బాధ్యతలను తెంచుకోవడం, బంధాలను తుంచుకోవడం తప్ప! కన్న తల్లిని కడసారి చూసుకోవడానికి మనసురాని కఠినాత్ముడికి జన్మనివ్వడం మా ఖర్మం" అంటూ తల బాదుకున్నాడు ఆయన.

"పోయిన తల్లి తిరిగి వస్తుందా తను వస్తే మాత్రం. కుటుంబంతో రావాలంటే లక్షలు ఖర్చవుతాయి మరి!" అని ఎవరో అనుకోవడం విన్పించింది నాకు.

నేను రావడం మంచిదే అయింది అనుకున్నాను. నలుగురూ ఏమైనా అని పోతారేమో అన్న భయంతోనే ఆ పదిరోజులూ ముళ్ళ మీదున్నట్టు గడిపాను.

"పిల్లవాడు బెంగ పడతాడు" అంటూ ఆఖరి రోజే ప్రయాణమయ్యాం నేనూ, మా ఆవిడ. అమెరికా నుంచి పెద్దాడు రాసిన ఉత్తరం అప్పుడే అందింది.

"అమ్మ మరణం నాకెంత బాధ కల్గించినా, ఆఖరి సంస్కారాలకి రావాలని ఎంత ప్రయత్నించినా వీలుపడలేదు. నాన్న పల్లె వదలి ఎటూ అమెరికాకి రాడు. కాబట్టి ఆయన తదనంతరం నా వాటాకి వచ్చే అయిదెకరాలూ నాకు చెందేలా డాక్యుమెంట్స్ తయారు చేసి పంపితే సంతకాలు పెట్టి పంపుతాను. ఇక నాన్న బాధ్యత నువ్వే వహించవలసింది" అంటూ రాశాడు.

ఆ రోజు నాన్న ముఖంలో కదలాడిన భావాన్ని ఏ రచయితా అక్షర రూపంలో పెట్టలేదేమో!

తను అదేమీ గుర్తించకుండా పొలాలన్నీ తెగనమ్మి తనతో పట్నం వచ్చెయ్యమని మొండికేశాడు. ఆయన కాదనడంతో కోపంగా భార్యను తీసుకువచ్చేశాడు. ఆ తర్వాత ఏ నెలకో ఒకసారి ముఖం చూసి వచ్చేసేవాడు. నియోజక వర్గంలోని చిన్నా పెద్దా రాజకీయనాయకులు ఎమ్మెల్యేగా పోటీ చేయమనడంతో ఎన్నికల్లో నిలబడ్డాడు. అందుకుగాను అవసరమైన డబ్బు కోసం తన వాటాకి వచ్చే పొలాన్ని అమ్ముకుంటానని తండ్రిని అడిగాడు.

"నిలకడలేని రాజకీయాల్ని నమ్ముకొని సుక్షేత్రం వంటి పొలాన్ని అమ్ముకుంటావా. నేల తల్లిని నమ్ముకోవాలి గాని అమ్ముకోకూడదురా" అంటూ కంట తడి పెట్టుకున్నాడు ఆయన.

అయినా ఆయన మాటను పెడచెవిన బెట్టి అయినకాడికి అమ్మేశాడు. ఆ తరువాత ఎన్నికల్లో ఓడిపోయాడు తను. ఆ వెంటనే వ్యాపారంలో నష్టాలు రావడం... ఒక దాని వెంట ఒకటిగా కష్ట, నష్టాలు దాపురించాయి.

"వీటన్నిటికీ ఆ ముసలాడే కారణం. శుభమా అంటూ ఏ మంచి పని చేద్దామన్నా "వద్దు, వద్దు" అంటూ అపశకునం మాటలే. అంటూ తన భార్య నానా మాటలూ అంది తండ్రిని. తను కూడా ఆమెనే సమర్థించి తండ్రిని చూడడానికి కూడా వెళ్ళడం మానుకున్నాడు. చివరికి ఒంట్లో శక్తి ఉడిగి మంచాన పడ్డాడన్నా వెళ్ళలేదు. "ఒక్కసారి వచ్చిపోరా" అని ఎన్నిసార్లు కబుర్లు పంపినా ఆయన బ్రతికి ఉండగా ఒక్కసారి కూడా వెళ్ళలేదు.

ఎంత కఠినంగా ప్రవర్తించాడు ఆ రోజుల్లో తను. "కన్న తండ్రి" అన్న విషయాన్ని స్మరించలేక పోయాడు. అలాంటి తనకు ఈ శిక్ష చాలా తక్కువే. వెచ్చగా పొంగి వచ్చాయి కన్నీళ్ళు. "నాన్నా... నన్ను క్షమించు" అప్రయత్నంగా వెలువడ్డాయామాటలు నోటి వెంట.

❋

ఉగ్రవాద సమస్య చాలా కాలం నుంచి ప్రపంచానికి పెద్ద సవాలుగా తయారైంది. దేశాధినేతల నుంచి దేశ దేశాలకు చెందిన వేలాది మంది ప్రజల వరకూ ఇలాంటి ఉన్మాద హత్యాకాండలో బలైపోయారు. 1984లో అప్పటి ప్రధాని ఇందిరా గాంధీ, 1991లో మాజీ ప్రధానిగా ఎన్నికల పోరాట మధ్యంలో వున్న రాజీవ్ గాంధీల హత్యలు ప్రపంచాన్నే కలవరపరిచాయి. ఇందిరాగాంధీని ఆమె అంగరక్షకులే హత్య చేశారు. రాజీవ్ గాంధీ హత్య మాత్రం పూర్తిగా అనూహ్యమైన పరిస్థితుల్లో జరగడంతో అందరూ దిగ్భ్రాంతి చెందారు. దొరికిన కొద్దిపాటి ఆధారాలతో హంతకుల వేట సాగించిన దర్యాప్తు బృందం అధిపతి డి.కార్తికేయన్, అనుభవాల 'నిప్పులాంటి నిజం'. మొదలెట్టిన తర్వాత ఆగకుండా డిటెక్టివ్ పుస్తకంలా చదివేస్తాము. కాని ఆ కట్టుకథల్లోని కల్పిత సాహసాలు కాక వాస్తవ జీవితం తాలూకూ కటిక నిజాలను ఇందులో తెలుసుకోగలుగుతాము.



రాజీవ్ హత్యలో
రాక్షస వ్యూహాలు ...

డి.ఆర్.కార్తికేయన్ పోలీసు శాఖలో జాతీయ స్థాయిన అనేక కీలక బాధ్యతలు నిర్వహించిన వున్నతాధికారి. సిఆర్‌పిఎఫ్, సిబిఐల డైరెక్టరుగా వ్యవహరించడమే కాక దౌత్య రంగంలోనూ పలు పదవులు చేపట్టారు. రాజీవ్ గాంధీ హత్య జరిగిన వెనువెంటనే ఆయనను ప్రత్యేక దర్యాప్తు బృందం (స్పెషల్ ఇన్వెస్టిగేషన్ టీం- సిట్) కు అధిపతిగా నియమించారు. తక్షణం రంగంలోకి దిగిన సిట్ అత్యంత విస్తృతమైన దర్యాప్తు సాగించింది. కొన్ని వేలమంది సాక్షులను విచారించి అందులో 1044 మందిని కోర్టులో హాజరు పర్చారు. 10,000 పేజీల వాంగ్మూలాన్ని సమర్పించారు. 26 మంది సాక్షుల మీద 251 ఆరోపణలు విచారించారు. 1991 మే 21న హత్య జరగ్గా 1994 జనవరి 19న ప్రారంభమైన విచారణ దీర్ఘకాలం పాటు సాగి చివరకు 1998 జనవరిలో ప్రత్యేక కోర్టు తుది తీర్పు వెలువడింది. దానిపై సుప్రీం కోర్టులో అప్పీలు మరి కొంతకాలం పట్టింది. ఆ విధంగా రాజీవ్ గాంధీ హత్యకేసు దేశంలోనే గాక ప్రపంచ న్యాయ చరిత్రలో కూడా చరిత్ర సృష్టించింది. రాజకీయంగానూ ఇది చాలా ప్రాధాన్యత సంతరించుకుంది. ఇలాంటి కేసు గురించి కార్తికేయన్ రాసిన ఈ పుస్తకం ఎంత విలువైందో చెప్పనవసరం లేదు.

కావడానికి పోలీసు అధికారి అయినప్పటికీ ప్రజా జీవితంతోనూ పుస్తకాలతోనూ బాగా సంబంధం కలిగిన కార్తికేయన్ ఎక్కడా పట్టు సడలకుండా పక్కదోవ తొక్కకుండా రచన సాగించారు. వ్యక్తిగా తన భావాలను, భావనలను చెబుతూనే బాధ్యతాయుతమైన అధికారిగా తన పరిమితులకు లోబడి రచన సాగించారు. అందుకే ఇది కేవలం సాంకేతిక వివరాలతోనో సాహిత్య పరిమళంతోనో నిండిపోకుండా రెండింటి మేలు కలయికగా సాగింది. 300 పేజీల ఈ పుస్తకాన్ని పదిహేను అధ్యాయాలుగా విభజించారు. అందమైన ముద్రణ ఆకట్టుకుంటుంది.

'అతను నాకు రాజీవుడే' అన్నది మొదటి అధ్యాయం. అందులో రచయిత రాజీవ్ గాంధీతో తనకు మొదటి నుంచి వున్న పరిచయం గురించిన వివరాలు రాశారు. తర్వాతి అధ్యాయం 'విశాఖ తీరం నుంచి మృత్యు గహ్వరంలోకి' ఇందిరాగాంధీ కుటుంబానికి ఆప్తురాలైన మరగతం చంద్రశేఖర్ కోసమే రాజీవ్ గాంధీ ప్రత్యేకంగా శ్రీపెరంబుదూరు సభకు హాజరవ్వాలని నిర్ణయించుకున్నారు. అయితే అంతకు ముందు ఆయన తన పర్యటన ముగించుకుని విశాఖ పట్టణం నుంచి బయలుదేరాల్సి వుంది. కాని ఆఖరి నిముషంలో విశాఖలో ఆయన విమానం ఎగరడానికి మొరాయించింది. ఇక లాభం లేదనుకుని ప్రయాణం రద్దుచేసుకుని వెళ్లిపోయారు. కాని ఇంతలోనే అనుకోకుండా రిపేరు జయప్రదం కావడంతో తనే విమానం నడిపించుకుంటూ చెన్నై చేరారు. అక్కడి నుంచి శ్రీ పెరంబుదూరు కొన్ని మైళ్ల దూరంలో వుంది. రాత్రి పది గంటల వేళ రాజీవ్ గాంధీ బృందం సభా స్థలం చేరేసరికి అంతా తొక్కిసలాటగా అయోమయంగా వుంది. అక్కడ అభిమానులను పలకరిస్తూ ఆయన ముందుకు సాగారు. ఆ సమయంలోనే చందనపు దండ పట్టుకుని వున్న ఒకమ్మాయి ఆయనకు పాదాభివందనం చేసేందుకు వంగింది. క్షణాల్లో భయానకమైన పేలుడు...! ఏం జరుగుతుందో తెలియని అల్లకల్లోలం. చూసే సరికి రాజీవ్ గాంధీ నిలబడి వున్న చోట పొగలు కక్కుతున్న మాంసఖండాలు మాత్రమే కనిపించాయి...! క్షణాల మీద ఈ దుర్వార్త దేశమంతా పాకింది. మధ్యంతర ఎన్నికల పోలింగ్ ఒక దశ పూర్తయినా మిగిలిన భాగాన్ని వాయిదా వేయవలసి వచ్చింది.

'సిట్ కి ముందు పెను సవాలు' అన్నది మూడవ అధ్యాయం. హత్య జరిగిన మరుసటి రోజునే సిబిఐ డైరెక్టర్ విజయకరణ్ హైదరాబాదులోని కార్తికేయన్‌ను సిట్ బాధ్యత స్వీకరించవలసిందిగా ఫోన్‌లో చెప్పారు. అంతేగాక ఈ కేసు ఎంత జటిలమైందో కూడా వివరించారు. ఈ బాధ్యత స్వీకరించడానికి కొన్ని షరతులు పెట్టిన కార్తికేయన్ వెంటనే రంగంలోకి దిగారు. వివిధ బృందాలుగా సిబ్బందిని విభజించడంతో పాటు ఇతర శాఖలతో సమన్వయం చేసుకున్నారు. హత్య జరిగినచోట లభించిన శరీరావశేషాలను బట్టి దండ పట్టుకున్న ధాను అనే యువతి ఈ హత్యకు కారణమై వుంటుందని వూహించారు. శ్రీలంకకు చెందిన భయానక తీవ్రవాద సంస్థ లిబరేషన్ టైగర్స్ ఆఫ్ తమిళ్ ఈలం (ఎల్‌టిటిఇ) ఆధ్వర్యంలో జరిగిన ఈ ఆ ఘటనలో హతుడైన స్థానిక ఫోటోగ్రాఫర్ హరిబాబు తీసిన ఫొటోలు లభించాయి. వాటి ఆధారంగా ముందుకు సాగేలోపునే అవి పత్రికలలో అచ్చవడంతో హంతకులకు కూడా తెలిసే ఆస్కారం ఏర్పడింది. మరోవైపున వారి రూపు రేఖలు ప్రజలకు తెలిసిపోవడంతో తప్పించుకోవడం కూడా కష్టమై పోయింది. అయినా తేలిగ్గా పట్టుకోగల అవకాశం లేదు. అందుకోసం సాగించే అన్వేషణలో అనేకానేక కొత్త ఆధారాలు, మలుపులు, పేర్లు, వూర్లు.. బయట నుంచి దర్యాప్తు తీరుపై విమర్శలు.. బెదిరింపులు, భయాందోళనలు..

వీటన్నిటి మధ్యనా లభించిన కొత్త ఆధారం నాలుగో అధ్యాయం 'చీకట్లో కాంతి రేఖ'. కాని అది చివరకు అనుకున్నంత ఫలితం ఇవ్వదు. కాని ధానుతో పాటు పక్కన జర్నలిస్టులా నిలబడి వున్న వంటికన్ను వ్యక్తికి, నళిని అనే మరో అమ్మాయికి ఈ కేసుతో సంబంధం వుందని తేలింది. మరోవైపున వైర్‌లెస్ సమాచారాన్ని అడ్డుకునే సందర్భంలో ఎల్‌టిటిఇకి సంబంధించిన కొత్త ఆధారం దొరికింది. ధాను ధరించిన దండను కొన్న రశీదు లభించింది. వంటికన్ను గుంటనక్క శివరాజన్ అని తేలింది. కాని వారిని పట్టుకునే అవకాశం కన్పించలేదు. కాని ఎల్‌టిటిఇకి సహకరించేవారిని వేటాడుతూ పోయిన కొద్దీ వారికి సహకరించిన వారు కూడా పలువురు పట్టుబడుతూ వచ్చారు. ధాను, శివరాజన్‌ల తర్వాత కీలక పాత్రధారులైన నళిని, మురుగన్‌లను పట్టుకోవడం సిట్ సాధించిన గొప్ప విజయం. అయితే సమాచారం ఆలస్యంగా చెప్పడం వల్ల అవతల హంతకులు తప్పించుకు పోతూ వచ్చారు. ఈ క్రమంలో ఎల్‌టిటిఇతో సంబంధాలున్న ఎందరో స్మగ్లర్లనూ, నేరస్తులనూ సిట్ గుర్తించగలిగింది. సాలెగూడులా అల్లుకుపోయిన ఎల్‌టిటిఇ అనేక ప్రలోభాల ద్వారానూ విద్వేష ప్రచారం ద్వారానూ కరుడుగట్టిన కార్యకర్తలను తయారు చేసుకుని ప్రలోభాలద్వారా కపటోపాయాల ద్వారా సంపాదించుకున్న సంబంధాలతో వారిని దాచిపెట్టగలుగుతున్నదని అర్థమైంది. అందుకే సిట్ కూడా పెద్ద ఎత్తున వేట సాగించవలసి వచ్చింది. అయితే మెడలో సైనైడ్ కట్టుకుని తిరుగుతూ తప్పనిసరి పరిస్థితుల్లో దాన్ని మింగి చచ్చిపోవడం తప్ప పట్టుబడటానికి ఇష్టపడని టైగర్ల సంప్రదాయం మరో పెద్ద సమస్యగా తయారైంది. ఆ విధంగా అనేక మంది ఆఖరి క్షణంలో ఆత్మహత్య చేసుకున్నారు. ఈ పరిణామాలన్నిటినీ రచయిత "ఫలితం లేని ప్రయాస", "మోసపోయాం", "సుడిగాలి వేట" తదితర అధ్యాయాల్లో సోదాహరణంగానూ కళ్లకు కట్టినట్టు చెప్పారు. చిట్టచివరి దాడి మీడియాలో విస్తారంగానే ప్రసారమైంది. బెంగుళూరులో శివరాజన్, శుభలను పట్టుకోవడానికి జరిగిన దిగ్బంధనం. అయితే వారు కూడా విషం మింగి చనిపోయారు. చనిపోయే ముందు శివరాజన్ ఎల్‌టిటిఇ అధినేత ప్రభాకరన్ పట్ల విశ్వాసం ప్రకటించే పాట రాశాడు! ఆఖరుకు వీరందరికీ సంధాన కర్తగా వ్యవహరించిన శంతన్‌నైనా పట్టుకోవాలనుకుంటే అతనూ శవంగానే దొరికాడు.

ఈ విధంగా రాజీవ్ హంతకుల వేటలో కీలక పాత్రధారులతో సహా అనేకమంది నిర్జీవులుగానే దొరకడం కూడా చిన్న విషయం కాదు. ఈ క్రమంలో ఎల్‌టిటిఇకి సంబంధించిన అనేక పత్రాలను, ఉత్తరాలను, సందేశాలను పరికరాలను సిట్ సేకరించగలిగింది. అయితే కేసు దాఖలు చేయాలంటే సంస్థగా దాని ప్రమేయాన్ని చూపించగలగాలి. ఆ లోటు కూడా ఆఖరులో తీరిపోయింది. రాజీవ్ గాంధీపై విషం కక్కుతూ శివరాజన్ ప్రసంగించిన క్యాసెట్, ధాను ఎల్‌టిటిఇ మహిళా దళం కమాండర్‌గా ముందు నడుస్తున్న దృశ్యం కూడా దొరికాయి. ఈ విషయమై ప్రభాకరన్ ఆదేశాలకు కూడా ఆధారాలు లభించాయి. కేసు ముగిసింది.

ఈ వివరాలు రాసిన తర్వాత కార్తికేయన్ 12 వ అధ్యాయంలో శ్రీలంక తమిళ సమస్య, ఎల్‌టిటిఇ పెరుగుదల గురించి వివరించారు. రాజీవ్ గాంధీనే ఎందుకు లక్ష్యంగా చేసుకున్నారో ఆ తర్వాత భాగంలో రాశారు. 1987 భారత శ్రీలంక ఒప్పందంపై సంతకాలు చేయడమే రాజీవ్‌గాంధీ నేరం. ఆయన గనక 1991 ఎన్నికల్లో మళ్లీ గెలుపొందితే తమ పరిస్థితి ఇంకా వెనక్కు పోతుందని టైగర్ల అంచనా. అందుకే ఆయన హత్యకై రాక్షస పథకం పన్నారని నిర్ధారించబడింది. ఇందులో తమిళనాడు రాజకీయాలు, శ్రీలంకలో వివిధ పార్టీల ఎత్తులు పై ఎత్తులు, ఢిల్లీలో రాజకీయ మార్పులు వగైరాలన్నిటి పాత్ర వుంది. ఈ విషయాలన్నిటిపైనా రాజకీయ దృష్టితో కాక కేవలం అధికారిగా కార్తికేయన్ తన అభిప్రాయాలు రాశారు. అయితే ఇందుకు సంబంధించిన అంతర్జాతీయ కోణాలు ఆయన పరిగణనలోకి తీసుకోలేదు. అలాగే తమ దర్యాప్తుపై వచ్చిన విమర్శలన్నిటినీ అర్థరహితమైనవనీ, రాజకీయ పూరితమైనవనీ కొట్టిపారేశారు.

ఆంధ్రప్రదేశ్ పత్రిక సంపాదకులు జి.వల్లీశ్వర్ చాలా హృద్యంగా అనువదించిన ఈ పుస్తకం చాలా అవసరమైందీ, ఆసక్తికరమైంది. ఉదాత్తమైన ఆశయాలు లేని ఉగ్రవాదుల ఉన్మాద స్వరూపాన్ని, నీతి బాహ్య పద్ధతులను తెలుసుకోవడానికి ఇది బాగా ఉపయోగపడుతుంది. అలాగే సంచలనాత్మకమైన నేరాల పరిశోధనలో దర్యాప్తు బృందాలు ఎంత కష్టపడవలసి వుంటుందో తెలుస్తుంది. అదే సమయంలో అనివార్యంగా దొర్లే లోపాలను, ఆఖరి క్షణాలలో ఆశాభంగాలను కూడా తెలియజెబుతుంది. అదే సమయంలో మన దేశంలో నేర నిర్ధారణ ఎంత కష్టమో కార్తికేయన్ చివరి అధ్యాయాలలో రాసిన విషయాలు ఆలోచించదగ్గవే. అయితే దర్యాప్తు బృందాల అధికారాలు పెంచడం, కఠినమైన చట్టాలు తీసుకురావడం మాత్రమే ఇందుకు పరిష్కారం కాదని కూడా గుర్తించవలసి వుంటుంది. రాజకీయ సంకల్పం, అన్ని వ్యవస్థలలో పూర్తి నిజాయితీ, సమస్యల సత్వర పరిష్కారం లేకపోతే వివిధ రకాల విధ్వంసక శక్తులు విరుచుకుపడుతూనే వుంటాయి.

నిప్పులాంటి నిజం
రాజీవ్‌గాంధీ హత్య- దర్యాప్తు
- ఒక వాస్తవ కథ
- డి.ఆర్.కార్తికేయన్,
రాధా వినోద్ రాజుతో కలిసి,
స్వేచ్ఛానువాదం : జి.వల్లీశ్వర్,
వెల : రూ.150/-, పేజీలు: 304,
ప్రతులకు : ఎమెస్కో బుక్స్, విజయవాడ-2.

వీరి వీరి గుమ్మడి పండు వీరి పేరేమి?

ఈ ఫోటో ఓ బాలీవుడ్ హీరోయిన్‌ది. జవాబు తెలియాలంటే 21వ పేజీ చూడండి.

కథా నిలయం
శ్రీకాకుళం

మూలం : బరీ మై హార్ట్ ఎట్ ఊండెడ్ నీ (డీ బ్రౌన్)
తెలుగు సేత: ముక్తవరం పార్థసారథి

జరిగినకథ

జనవరి9 నాడు షెయెనీలను తన ఆఫీసుకు పిలిపించి చివరి ఆదేశాలిచ్చాడు వెసెల్స్. డల్‌నైఫ్ వెళ్ళనన్నాడు. వైల్డ్ హాగ్, క్రో, లెఫ్ట్ హ్యాండ్‌లను సైనికులు బలవంతంగా లాక్కెళ్లారు. ఆ తర్వాత రెండు చేతులకూ సంకెళ్లతో పరిగెత్తుకుని వచ్చాడు. ఏం జరుగుతుందో తెలియక ఇతర షెయెనీలు భయభ్రాంతులయ్యారు. "దక్షిణంగా వెళ్లం" అంటూ బిగ్గరగా అరిచాడు వైల్డ్‌హాగ్. వెంటనే అతణ్ణీ గొలుసుల్తో బంధించారు. తిరగబడిన ఇతరులను కూడా తీవ్రంగా కొట్టి గాయపరిచారు.

అమెరికన్ డేగ

(57వ భాగం)

ఆ తర్వాత "స్త్రీలనూ, పిల్లల్నీ వదలండి. వాళ్లేం నేరం చేశారని" అంటూ సర్ది చెప్పబోయాడు వెసెల్స్. కాని, అప్పటికే అవమానంతో, బాధతో రగిలిపోతున్న షెయెనీలు "అందరం కలిసి చస్తాం" అంటూ బిగ్గరగా నినాదాలు చేశారు. ఆ రాత్రి బందీలు పారిపోకుండా అదనపు జాగ్రత్తలు తీసుకున్నారు సైనికులు. రాత్రి వెన్నెలలో మంచు మెరిసి పట్ట పగలు లాగుంది. ఆరుగురు గార్డుల సీల్డు బాయ్‌నెట్లు కూడా తళతళలాడాయి.

ఒక షెయెనీ యోధుడు, జైలు కప్పుగా వున్న కలపదుంగను లాగి పట్టుకున్నాడు. దుస్తుల్లో దాచుకుని తెచ్చిన తుపాకుల గొట్టాలు కూడా సిద్ధంగా వున్నాయి. మిగతా పరికరాలు పోగు చేసి 'గన్' అసెంబుల్ చెయ్యటం వాళ్ళకు తెలుసు. సుత్తెలు, తూటాలు కూడా వున్నాయి. రెండు మూడు గంటల్లో ఆయుధాలు సిద్ధమయ్యాయి. యువకులు మొహాలకు రంగు పులుముకుని కొత్త దుస్తులు తొడుక్కొని పారిపోవటానికి సిద్ధంగా వున్నారు. స్త్రీలు, బట్టల మూటలు వీపులకు కట్టుకుని నాయకుని సైగ కోసం నిరీక్షించారు. గార్డులను గురి చూసి పిస్టల్ పేల్చితే ఆ తర్వాత పలాయనమే.

రాత్రి 9.45కు తొలి రౌండ్లు పేల్చారు. షెయెనీలందరూ జైలు గోడలు కూల్చి బైటికి పరిగెత్తారు. నేలకూలిన సైనికులు, గార్డుల ఆయుధాలు లాక్కోవటంతో ఆత్మవిశ్వాసం పెరిగింది. అందరూ పదినిమిషాలు పరిగెత్తారో లేదో అశ్వికదళం వాళ్ళవైపు దూసుకువచ్చింది. షెయెనీ యోధులు, స్త్రీలు, పిల్లలకు రక్షణ కవచంలా నిలబడి కాల్పులు ప్రారంభించారు. కాని వాళ్ళ ఆయుధాలు చాలా పరిమితం. అలల లాగా వచ్చిన సైనికులనెంతసేపు ఎదిరించగలరు! మొదటి గంటలో సగం మంది షెయెనీలు నేలకొరిగారు. అలా మరణించిన వాళ్లలో డల్‌నైఫ్ కూతురు కూడా వుంది. ఆ తర్వాత, 65 మంది షెయెనీలను బందీలుగా పట్టుకున్నాడు. అందులో 23 మంది క్షతగాత్రులే. ఆ రాత్రి జైలు గోడ బద్దలు కొట్టిన వారిలో 32 మంది మాత్రమే సైనికులకు చిక్కకుండా పారిపోగలిగారు.

డల్‌నైఫ్, అతడి భార్య, కుమారుడు, కోడలు, మనవడు, మరో యువకుడు రెడ్ బర్డ్ సమీపంలో వున్న కొండలలో దాగి, ప్రాణాలు రక్షించుకున్నారు.

కళ్లుగప్పి తప్పించుకున్న 32 మందినీ వెంటాడి వేటాడి హ్యాట్ క్రీక్ బ్లఫ్స్ వద్ద ఒక పశువుల కొట్టంలో ట్రాప్ చేశారు సైనికులు. ఇండియన్ల వద్ద ఆయుధాలు కూడా లేవు. అశ్వికులు, నలువైపులనుంచీ తమ కార్బైన్లతో వాళ్ల మీద అగ్ని వర్షం కురిపించారు. షెయెనీల నుంచి ఎటువంటి ప్రతిఘటనా లేదు. ఆ మారణకాండలో తొమ్మిది మంది స్త్రీలు, పిల్లలు మాత్రమే మిగిలారు.

జనవరి నెల చలిలో కేవలం రాత్రుళ్లు మాత్రమే రహస్యంగా ప్రయాణం కొనసాగించి డల్‌నైఫ్ బృందం పైన్ రిడ్జి చేరింది. అక్కడ వున్న వాళ్లందరూ రెడ్ క్లౌడ్ ఏజెన్సీలో బందీలేనని తెలుసుకోవడానికి ఎక్కువ సమయం పట్టలేదు.

నియోబ్రారా వుపనది మీదున్న లాస్ట్ చోక్ చెర్రీ క్రీక్‌లో చలికి ఘనీభవించిన మంచులో గుంతలు తీసి, వాటిలోనే చలికాలమంతా గడిపారు లిటిల్ ఊల్ఫ్ అతడి అనుచరులు. రహస్య జీవితం అంతే మరి. కనిపిస్తే ప్రాణాలకే ముప్పు. 'సోర్ ఐ మూన్' రుతువులో చలి కాస్త తగ్గిన తర్వాత టంగ్ రివర్ వైపు కదిలారు. ప్రయాణం సజావుగానే సాగింది. బాక్స్ ఎల్డర్ క్రీక్ వద్ద టూమూన్ మరో అయిదుగురు ఉత్తర షెయెనీలూ తారసపడ్డారు. వాళ్లు ఫోర్ట్ కియోగ్‌లో సైనికులకు గూఢచారులుగా పనిచేస్తున్నారు.

వైట్ హ్యాట్ క్లార్క్ తన కోసం వెదుకుతున్నాడని లిటిల్ వూల్ఫ్‌తో చెప్పాడు టూమూన్. అంతకన్నా కావలసిందేముంది. వైట్ హ్యాట్ తన పాత మిత్రుడే. అతణ్ణి సంతోషంగా కలుస్తానన్నాడు లిటిల్‌వూల్ఫ్. షెయెనీ క్యాంపుకు అరమైలు దూరంలో సమావేశం ఏర్పాటు చేశారు. ఆయుధాలు లేకుండా ఒంటరిగా వచ్చాడు లెఫ్టినెంట్ క్లార్క్. తొలి మర్యాదల తర్వాత షెయెనీలందరూ ఫోర్ట్ కియోగ్‌లో చేరితే బాగుంటుందని ప్రతిపాదించాడు. అక్కడ వుండాలంటే ఏం చెయ్యాలి మరి? ఆయుధాలు వున్న చోట శాంతి వుండదు. మీరందరూ ఆయుధాలు, గుర్రాలు మాకు అప్పగించి ఫోర్టులో ప్రవేశించాలన్నాడు క్లార్క్.

"ప్రయాణాలతో అలసిపోయి వున్నాం మేమంతా. మా సోదరుడు డల్‌నైఫ్, ఫోర్ట్ రాబిన్సన్‌లో లొంగిపోయాడు. కానీ అక్కడ వాళ్లలో అనేకమందిని కాల్చిచంపారు మీ సైనికులు. మా వద్ద ఆయుధాలు వుండొద్దంటున్నారు. మీరు తుపాకులు ఎక్కుపెడితే ఎలా? ఆత్మరక్షణ చేసుకోవాలి మరి? నువ్వు నా పాత మిత్రుడివి. నిన్ను నమ్ముతున్నాను" అన్నాడు లిటిల్‌వూల్ఫ్.

ఆ తర్వాత, ఫోర్ట్ కియోగ్ చేరిన షెయెనీలు త్వరలోనే సైనికులకు వేగులవాళ్లుగా మారారు. "ఇన్నాళ్లూ అష్టకష్టాలూ పడిన మేం అక్కడ విస్కీ తాగడం అలవాటు చేసుకున్నాం. అదెంత బాగుందంటే, నాకిచ్చిన జీతమంతా దీని మీదే తగలేశాను" అని చెప్పుకున్నాడు వుడెన్ లెగ్. మొత్తం మీద షెయెనీల ఈ బలహీనత వల్ల విస్కీ అమ్మిన తెల్లవాళ్లు సంపన్నులైనారు. తెగలో

యుద్ధపాటవం తగ్గింది. నాయకత్వ లక్షణాలు అంతరించాయి. లిటిల్ వూల్ఫ్ జీవితం అలాగే నాశనమైంది. అధికారుల అలసత్వం వలన అనేక నెలలు గడిచాక క్యాంపులో చావగా మిగిలిన స్త్రీలు, పిల్లల్ని పైన్ రిడ్జ్ వద్ద రెడ్ క్లౌడ్ ఏజెన్సీకి తరలించారు. అప్పటికి, డల్‌నైఫ్ ఇంకా అక్కడే వున్నాడు. మరికొన్నాళ్లకు ఫోర్ట్ కియోగ్‌లో వున్న షెయెనీలకు టంగ్ రివర్ వద్ద రిజర్వేషన్ ఏర్పాటు చేశారు. డల్‌నైఫ్‌కు వయసు మీద పడింది. మిగిలిన షెయెనీలలో కూడా పోరాటపటిమ చచ్చింది. సాండ్‌క్రీక్ వద్ద అమెరికన్ సైన్యాన్ని చిత్తుగా ఓడించిన యోధులు కారు వారిప్పుడు. ఒకప్పటి 'బ్యూటిఫుల్ పీపుల్' యొక్క వికృత రూపాలుగా మిగిలిన షెయెనీల అంతిమదశ అది. "మేం యుద్ధ రంగంలోనే మరణిస్తాం!" అంటూ ప్రతిజ్ఞలు చేశారు కొందరు యువకులు. కానీ అది సంఘటిత శక్తి కాదు. త్వరలోనే వాళ్లూ అనామికులుగా మరణించారు.

స్టాండింగ్ బేర్

"తూర్పు నుంచి పశ్చిమానికి మమ్మల్ని తరిమేశారు. రెండు వేల ఏళ్లగా ఇది మా నేల. మిత్రులారా! మిమ్మల్ని నిర్వాసితులను చేయకండి. నన్ను కనీసం ఇక్కడే మట్టిలో కలిసిపోనివ్వండి. మీరు మిలియన్ డాలర్లు ఇస్తామన్నా ఈ నేల రాసివ్వను. పశువులను బంజరుదొడ్లలో బంధించి వధించినట్టుగా మీరు మమ్మల్ని ఇక్కడి దాకా తరిమారు. మా పెద్దల్ని చంపారు. సోదరుల్ని చంపారు. పిల్లల్ని చంపారు. ఇంక మిగిలింది నేనే...."

-పోంకా తెగకు చెందిన స్టాండింగ్ బేర్.

"తెల్లవాళ్ల దృష్టిలో మాకూ, పశువులకూ తేడా లేదు. నియోబ్రారా వద్ద ఒక కొట్టంలో బంధించారు మమ్మల్ని. మరికొన్నాళ్లకే, అక్కడా వుండనివ్వకుండా ప్లాట్ రివర్ వైపు తరిమారు. "మేం మనుషులం. గుర్రాలం కాము. సైనికులను చూస్తే మా స్త్రీలకు భయం. మా కోసం ఏర్పాటు చేసిన వార్మ్ ల్యాండ్ (ఇండియన్ టెరిటరీ) ఒక ఎడారి. అక్కడేమీ దొరకదు. రోగాలతో ఏడాది తిరక్కుండానే సగానికి ఎక్కువగా మరణించారు. మామీద ఎవరికీ జాలి లేదా? మాకన్నా ముందే మా పశువులు కూడా మృత్యువాత పడ్డాయి. ఆ వేడి మేం భరించలేం. మరికొన్నాళ్లిక్కడే వుంటే మాలో ఒక్కరూ మిగలరు"

-పోంకా నాయకుడు వైట్ ఈగెల్.

1804లో, నియో బ్రారా నది ముఖద్వారం వద్ద వున్న మిస్సోరీలో, స్నేహానికి ప్రాణమిచ్చే పోంకాలతో పరిచయం పెంచుకున్నారు లూయిస్, క్లార్క్. అప్పటికి ఆ తెగ సంఖ్య రెండు మూడు వందలకు మించదు. కొద్ది కాలం క్రితమే మశూచి వచ్చి అందరూ మరణించగా మిగిలింది వీళ్లే. యాభై ఏళ్ల తర్వాత, పోంకాల జనాభా వెయ్యికి మించింది. తెల్లవాళ్లతో వ్యాపార సంబంధాలు పునరుద్ధరించుకోవడం వల్ల సుఖసంతోషాలు పెరుగుతాయని ఆశించారు. ఇతర ఇండియన్ తెగలతో పోలిస్తే వీళ్ల జీవనశైలి భిన్నమైంది. వేటమీద కాకుండా, వ్యవసాయ కార్యక్రమాలు ఇష్టపడతారు. మొక్కజొన్న, రకరకాల కూరగాయలూ పెంచడం నేర్చుకున్నారు. అశ్వసందప కూడా ఎక్కువే. ఈ గుర్రాలను

చివరికి, ఒప్పందంలోని షరతులు, బాధ్యతలను గుర్తించిన ప్రభుత్వం. భూమిని తిరిగి పోంకాలకు ఇవ్వడానికి బదులు దొంగతనాలు, హత్యలకు పరిహారంగా కొద్దిగా డబ్బు సర్దుబాటు చేస్తామంది. చివరికి, 1876లో కస్టర్ పరాజయంతో ఇతర తెగలతోపాటు పోంకాలను కూడా ఇండియన్ టెరిటరీకి తరలించడానికి నిర్ణయించారు. నిజానికి పోంకాలు కస్టర్‌ను ఎప్పుడూ ఎదిరించలేదు. ఇతర తెగల "నేరాలకు" వీళ్లు శిక్ష అనుభవించాల్సి వచ్చింది. వాషింగ్టన్‌లో ఒక అధికారి, వీళ్ల తరలింపు'కు అయ్యే ఖర్చుకు లెక్కలు చూపి 25,000 డాలర్లు జేబులో వేసుకున్నాడు.



దొంగిలించడానికి వచ్చిన సియో తెగలను నిలువరించడానికి ఆయుధాలు కూడా బాగానే సమకూర్చుకున్నారు. 1858లో, వివిధ తెగలకు ప్రభుత్వం కొత్త సరిహద్దులు నిర్దేశించినప్పుడు, తమ భూభాగం కొంత స్వచ్ఛందంగా వదులుకోవడానికి కూడా అంగీకరించారు పోంకాలు. దీనికి ప్రతిగా, నియోబ్రారా వద్ద శాశ్వత నివాసం కల్పిస్తామని వాగ్దానం చేశారు అధికారులు. కానీ, పదేళ్ల తర్వాత 1868లో కొత్త ఒప్పందాలు కుదుర్చుకుంటున్న సమయంలో, వీళ్లకు కేటాయించిన భూమి మీద సియోలకూ అధికారం కల్పించారు. ఇది అధికారులు చేసిన పెద్ద తప్పిదం.

సహజంగానే పోంకాలు తీవ్ర నిరసన తెలియచేశారు. కాని వాషింగ్టన్‌లో ఎవరూ పట్టించుకోలేదు. సియోలు యుద్ధం ప్రకటించి, పోంకాల గుర్రాలు లాక్కుని, ఆస్తులు దోచుకొని ఆ ప్రాంతం నుంచి తరిమెయ్యడానికి అన్ని ప్రయత్నాలూ చేశారు. రెండు తెగల మధ్య ఏడేళ్ల పాటు తీవ్రమైన పోరాటాలు జరిగాయి. "పోంకాలకు భద్రత లేకుండా పోయింది. ఒక చేత పార మరో చేత తుపాకి పట్టుకుని తమ ప్రాంతంలో తామే శరణార్థులుగా గడిపారు వీళ్లు. పండించిన పంట దక్కుతుందనే నమ్మకం లేదు. స్త్రీలూ, పిల్లలూ ప్రాణాలరచేత పట్టుకుని బతకాల్సి వచ్చింది" అంటూ ఆ రోజుల్ని గుర్తు చేసుకున్నాడు ఒక తెగనాయకుడు పీటర్ లీక్లెయిర్.

చివరికి, ఒప్పందంలోని షరతులు, బాధ్యతలను గుర్తించిన ప్రభుత్వం. భూమిని తిరిగి పోంకాలకు ఇవ్వడానికి బదులు దొంగతనాలు, హత్యలకు పరిహారంగా కొద్దిగా డబ్బు సర్దుబాటు చేస్తామంది. చివరికి, 1876లో కస్టర్ పరాజయంతో ఇతర తెగలతోపాటు పోంకాలను కూడా ఇండియన్ టెరిటరీకి తరలించడానికి నిర్ణయించారు. నిజానికి పోంకాలు కస్టర్‌ను ఎప్పుడూ ఎదిరించలేదు. ఇతర తెగల "నేరాలకు" వీళ్లు శిక్ష అనుభవించాల్సి వచ్చింది. వాషింగ్టన్‌లో ఒక అధికారి, వీళ్ల తరలింపు'కు అయ్యే ఖర్చుకు లెక్కలు చూపి 25,000 డాలర్లు జేబులో వేసుకున్నాడు. ఇండియన్ టెరిటరీలో ఇండియన్లు మాత్రమే వుండాలని మొదట భావించింది. కానీ తెల్ల సెట్లర్లు వీళ్లను అక్కడా వదల్లేదు (కొద్ది నెలల్లోనే వాళ్లూ అక్కడ గ్రామాలు నిర్మించుకున్నారు). పోంకాల భూమి చాలా సారవంతమైంది. పంటలకు అనువైన ఈ పొలాలన్నీ పదేళ్లలో సెట్లర్ల వశమయ్యాయి.

పోంకాలు, ఇండియన్ టెరిటరీకి వెళ్లకతప్పదని, మొదట వార్త చేరవేసిన వాడు యునైటెడ్ స్టేట్స్ ఇండియన్ ఇన్‌స్పెక్టర్ ఎడ్వర్డ్ సి.కెంబుల్. "1877 జనవరిలో మాకు తెలిసింది. అందర్నీ చర్చికి పిలిపించి "ఇది ప్రభుత్వ ఆజ్ఞ అని చెప్పారు" అంటూ గుర్తు చేసుకున్నాడు వైట్ ఈగెల్. అతని వాంగ్మూలం పూర్తి పాఠం ఇలా రికార్డు చేశారు.

"గ్రేట్ ఫాదర్ తీసుకున్న నిర్ణయమిది" అన్నాడా తెల్లమనిషి. "మిత్రుడా! ఇది అన్యాయం. మా భూమి మీద ఆయనకేం అధికారముంది?" అని ప్రశ్నించాడు.

"ప్రభుత్వ నిర్ణయాల్ని మీరు ధిక్కరించారు"

"ఆయనకు మా గురించి తెలియదనుకుంటాను. నువ్వు గ్రేట్ ఫాదర్‌కు లేఖ రాసి మా అభిప్రాయం కూడా తెలియచెయ్యి"

"అలాగే" అంటూ అతడు ఒక వైరు ద్వారా ఆ విషయం తెలియచేశాడు.

తక్షణమే టెలిగ్రాఫ్ సందేశం గ్రేట్ ఫాదర్‌కు చేరిందట.

"మాలో పదిమందిని వాషింగ్టన్‌కు ఆహ్వానించాడు గ్రేట్ ఫాదర్" అని చెప్పాడు.

మేం వెంటనే, బయల్దేరి (వార్మ్‌లాండ్) ఇండియన్ టెరిటరీ గుండా ప్రయాణం చేసి, రైలెక్కి, 'ఒసాజెస్', 'కా' తెగల రిజర్వేషన్లను చూస్తూ, కాన్సస్‌లో విశ్రాంతి తీసుకొని అర్కాన్సా సిటీ చేరుకున్నాం. మా తెగలకు కేటాయించిన భూములన్నీ రాళ్లూ రప్పలతో నిండిన బంజరు భూములే.

ఇంకా వుంది....

...తెలివితక్కువగా టైం వేస్ట్ చేశాను

సినిమాలమీదున్న పిచ్చితో శేఖర్ సూరి ముంబాయి వెళ్ళి ఎనిమిదేళ్ళపాటు సస్పెన్స్, థ్రిల్లర్ సీరియల్స్‌కు రచయితగా పని చేశారు. పలు చిత్రాలకు స్క్రిప్ట్ సిద్ధం చేశారు. సంజయ్‌దత్‌తో సినిమా తీసే అవకాశం అందినట్లే అంది చేజారింది. ఆయన దర్శకత్వం వహించిన తొలి చిత్రం 'అదృష్టం' వెక్కిరించింది. పట్టుదల ముందు కష్టాలు చిన్నవిగా కనిపించాయి. రాత్రింబగళ్ళు స్క్రిప్ట్‌పై కూర్చున్నారు. షూటింగ్ ప్రారంభానికి ముందే సినిమా ఎలా తీయాలో ఊహల్లో విజువలైజ్ చేసుకున్నారు. 'ఎ ఫిలిం బై అరవింద్' అనే సస్పెన్స్ థ్రిల్లర్‌ను అందించి దర్శకుడిగా తానేమిటో నిరూపించుకున్నారు. తను దర్శకత్వం వహించిన సైకలాజికల్ థ్రిల్లర్ 'త్రీ' త్వరలో విడుదలకు సిద్ధమవుతోంది. ఈ సందర్భంగా ఆయన అంతరంగాలు...



శేఖర్‌సూరి

పశ్చిమ గోదావరి జిల్లా తణుకులో పుట్టి ఇప్పటికి 35 ఏళ్ళయింది. చిన్నప్పుడు ఎక్కువగా టీవీ సీరియల్స్ చూసేవాణ్ణి. బి.కాం పూర్తి చేశాను. సి.ఎ (చార్టర్డ్ ఎకౌంటెన్సీ) చేద్దామనుకున్నాను. సినిమాలపై వున్నంత ఇష్టం చదువుపై లేదు. దీంతో స్టడీస్‌పై ఏకాగ్రత పెట్టలేకపోయాను. డైరెక్టర్ కావాలన్న దృఢ నిశ్చయానికొచ్చాను. ముంబాయి చేరుకున్నాను. మర్చిపోయాను చెప్పటం. నా అసలు పేరు యస్.యస్. చంద్ర శేఖర్. ఈ పేరుతో చాలామంది ఉంటారు. అలాగే ఇండ్రస్టీలో కూడా. దీంతో శేఖర్ సూరిగా మార్చుకున్నాను. మా అన్నయ్యకు జ్యోతిష్యం, సంఖ్యాశాస్త్రంలో ప్రవేశం ఉంది. దీంతో ఆయనే నాకీ పేరు పెట్టాడు. పట్టుదల ముందు కష్టాలు చిన్నవిగా కనబడ్డాయి. ముంబాయి ఎందుకొచ్చానో మరోసారి ఆలోచించి, తిరుగుముఖం పట్టకూడదని డిసైడ్ అయ్యాను. ఎనిమిది సంవత్సరాలపాటు ఘోస్ట్ రైటర్‌గా పని చేశాను. పలు సస్పెన్స్, థ్రిల్లర్ టీవీ సీరియల్స్‌కు రచయితగా పని చేశాను. అలాగే సినిమాలకు స్క్రిప్ట్ వర్క్ అందించాను.

ఎట్టకేలకు సంజయ్‌దత్ డేట్స్ సంపాదించాను. అదృష్టం వెక్కిరించింది. అదే సమయంలో ఆయన నటించిన 'వాస్తవ్' బాక్సాఫీస్ దగ్గర హిట్ కావడంతో డేట్స్ వాయిదా పడ్డాయి. వేరే దారి కనబడలేదు. ముంబాయిలో బతుకు భారమైంది. ఏం చేయాలో దిక్కుతోచని స్థితి. మానసికంగా ధైర్యం కోల్పోయాను. దిక్కుతోచని స్థితిలో హైదరాబాద్‌లో వాలాను. ఎనిమిదేళ్ళ ముంబాయి జీవనంలో ఇక్కడి ఫ్రెండ్స్‌కు, బంధువులకు చాలా దూరమయ్యాను.

హైదరాబాద్ వచ్చాక ఓ రోజు బస్‌స్టాప్‌లో నుంచున్నాను. దగ్గర్లో ఓ ఫంక్షన్ జరుగుతోంది. ఇంతలో ఫ్రెండ్ కనబడ్డాడు. అతనే ఆ ఫంక్షన్ ఏర్పాటు చేస్తున్నాడు. అక్కడికి తీసుకెళ్ళాడు. ఆ వేడుకకు తరుణ్ ముఖ్య అతిథిగా విచ్చేశాడు. అతను నటించిన 'నువ్వే కావాలి' ఆ టైంలోనే విడుదలై సక్సెస్ అయింది. ముంబయిలో కో-డైరెక్టర్‌గా పనిచేస్తున్నాడని నన్ను తరుణ్‌కి పరిచయం చేశాడు. ఆ పరిచయం నా జీవితానికి ఓ వెలుగు చూపించింది.

నా తరహాలో తెరకెక్కించలేదు

తరుణే దగ్గరుండి నిర్మాత ఆర్.బి. చౌదరిగారికి పరిచయం చేశారు. ప్రిన్స్ చార్లెస్ ఇండియా సందర్శించినపుడు బాలీవుడ్ నటి పద్మిని కొల్హాపురి అతన్ని ముద్దు పెట్టుకుంది. అప్పట్లో అది పెద్ద చర్చనీయాంశమైంది. దీన్ని ఇతివృత్తంగా తీసుకుని కథ అల్లాను. సామాన్యుడు ఓ యువరాణిని ముద్దు పెట్టుకునే లైన్‌తో కథ తయారు చేశాను. ఇలా నా తొలి చిత్రం 'అదృష్టం' తెరకెక్కింది. అది కాస్తా బాక్సాఫీస్ వద్ద బోల్తా కొట్టిందనుకోండి. నిజం చెప్పాలంటే నా శైలిలో ఆ చిత్రం తీయలేకపోయాను. అందుకే అది ఫెయిలైంది. అసలా చిత్రంలో పాటల అవసరం లేదు. కానీ ఒత్తిడి మేరకు జొప్పించాల్సి వచ్చింది. క్రమంగా తెలుగు సినిమా ఫీల్డ్‌ని అర్థం చేసుకున్నాను.

'అదృష్టం' మిస్ అయ్యాక రాత్రింబగళ్ళు కూర్చొని 'ఎ ఫిలిం బై అరవింద్' స్క్రిప్ట్ సిద్ధం చేశాను. ప్రతి ఫ్రేమునూ ఛాలెంజ్‌గా తీసుకుని తీర్చిదిద్దాను. షూటింగ్ ప్రారంభానికి ముందే సినిమా ఎలా తీయాలో ఊహల్లో విజువలైజ్ చేసుకున్నా. చిత్రాన్ని అన్ని వర్గాల ప్రేక్షకులు ఆదరించారు.

'ఎ ఫిలిం బై అరవింద్' చిత్రానికి తాజా 'త్రీ'కీ చాలా గ్యాప్ తీసుకున్నారెందుకు?

అలా కనిపించిందేగానీ.. నేనెప్పుడూ గ్యాప్ తీసుకోలేదు. ఈ టైంలో ఓ పెద్ద హీరోతో సినిమా చేయాల్సివుంది. ఆయన పేరు మాత్రం అడగొద్దు. ఆర్నెల్లపాటు స్క్రిప్ట్‌పై కూర్చొన్నాను. కానీ ఆ ప్రాజెక్ట్ అటకెక్కింది. తెలివితక్కువగా స్టార్ కోసం టైం వేస్ట్ చేశానని బాధపడ్డాను. అదొక మంచి గుణపాఠం. స్టార్ ఒక దర్శకుణ్ణి తయారు చేయలేదు. కానీ ఓ దర్శకుడు స్టార్‌ని చేస్తాడని తెలుసుకున్నాను. ఉదాహరణకు దాసరి నారాయణరావుగారిని తీసుకుంటే ఆయన ఎంతమంది స్టార్స్‌ను తయారు చేయలేదు... పూరీ జగన్నాథ్ 'ఇట్లు శ్రావణి సుబ్రమణ్యం', 'ఇడియట్', 'అమ్మ నాన్న ఓ తమిళ అమ్మాయి' తీయకపోతే రవితేజ పొజిషన్ ఏంటి? పూరీనే రవితేజాను ఓ స్టార్ చేశాడు కదా! రవితేజ పూరీని స్టార్ డైరెక్టర్ చేయలేదు కదా! 'ఎ ఫిలిం బై అరవింద్' ముందు రిషి గురించి ఎవరికి తెలుసు? ఈ సినిమాతో రిషి ఏడు చిత్రాల్లో నటించే అవకాశాన్ని సొంతం చేసుకున్నాడు. పెద్ద హీరోలతో పని చేయడమంటే సహజంగా స్వేచ్ఛ కోల్పోతాం. ఆలోచనా పరిధి పరిమితమవుతుంది.

సినిమా ఇండస్ట్రీ గురించి...

ఇక్కడ హిపోక్రసీ ఎక్కువ. మన నిర్మాతలు ఒక వైపు ఎన్ని ఫ్లాప్ సినిమాలొచ్చినా మరో వైపు స్టుపిడ్ కథాంశాలతో సినిమాలు తీస్తూనేవుంటారు. సినిమా ఫ్లాప్ అయితే ఎంతమంది హీరోలు ఫలితాన్ని తనపై వేసుకుని రెమ్యునరేషన్ తిరిగిచ్చేస్తున్నారు?

'త్రీ' గురించి...

'త్రీ' విషయానికొస్తే... యువ పారిశ్రామికవేత్త ఫణి రాజ్ పరిచయమయ్యాడు. 'ఎ ఫిలిం బై అరవింద్' తరహాలో తనకొక సినిమా చేసి పెట్టమని అడిగాడు. రెగ్యులర్ కమర్షియల్ సినిమాలా లేకపోయినా ఫర్వాలేదు... శేఖర్ సూరి

'ఎ ఫిలిం బై అరవింద్'లా ఉంటే చాలని ముందే చెప్పారు. సైకలాజికల్ థ్రిల్లర్ ఇతివృత్తంతో స్క్రిప్ట్ సిద్ధం చేశాను. ఖర్చు విషయంలో రాజీపడకుండా సహకరించారు. దీంతో నేననుకున్న విధంగా తీయగలిగాను.

సినిమా గురించి డీప్‌గా చెప్పలేను. అంతా ఇప్పుడే చెప్పేస్తే చూసేటప్పుడు థ్రిల్ ఉండదు. చిత్రం ఎంటర్‌టైన్ చేస్తుంది. ఇందులో ముగ్గురు హీరోలు... ముగ్గురు హీరోయిన్లు. 'త్రీ' అన్న టైటిల్ పెట్టాం కాబట్టి ముగ్గురు (రాజీవ్ కనకాల, రిషి, శాంతి చంద్ర) చుట్టూనే కథ తిరగదు. హైదరాబాద్‌లో జరిగిన యదార్థ సంఘటన ఆధారంగా దీన్ని తీశాను.

కమర్షియల్ సాంగ్స్‌కు మీరు వ్యతిరేకమనుకుంటా?

నేనెప్పుడూ వ్యతిరేకిని కాను. కాకపోతే ప్రస్తుతం వస్తున్న ట్రెండ్ సాంగ్స్‌కు వ్యతిరేకిని. గతంలో ఎన్.టి.ఆర్, ఎ.ఎన్.ఆర్ చిత్రాలను తీసుకుంటే పాటలు సంబంధాలను, బంధుత్వాన్ని ఎస్టాబ్లిష్ చేసేవి. కథలో అంతర్భాగంగా సాగేవి. ఆ పరిస్థితి నేడు ఉందా? పాటలు సినిమా మూడ్‌కు జత కలిసేవిగా ఉండాలనుకుంటాను. ఏకాగ్రతను భంగపరిచేవిగా ఉండకూడదు. అలాగే మెలోడ్రామా చిత్రాలను కూడా వ్యతిరేకిస్తాను. అర్థం పర్థంలేని ప్రేమ చిత్రాలు వస్తున్నాయి. హీరోయిన్ కళ్ళల్లో హీరో కళ్ళు పెడతాడు. వెంటనే డ్రీమ్ సాంగ్‌లోకి వెళ్ళిపోతారు. దీనికితోడు అసభ్యకరమైన మూమెంట్స్. ఈ తరహా ట్రెండ్‌కు ఎందుకింతగా అలవాటు పడ్డారో అర్థం కావడం లేదు.

ఇటీవలే ఓ ఇంటర్నేషనల్ ఫిలిం ఫెస్టివల్‌కు వెళ్ళాను. ఓ మంగోలియన్ దర్శకుడు నా పక్కనే కూర్చున్నాడు. ఆయన చప్పిడి ముక్కు నాకు వింతగా అనిపించి ఆయన్నే అబ్జర్వ్ చేస్తున్నాను. ఆయన నా ఆసక్తి గమనించినా...మిన్నకుండిపోయాడు. ఇంతలో ఓ మోడ్రన్ తెలుగు సినిమా ప్రదర్శిస్తున్నారు. పాట రాగానే... ఎన్ని రకాలుగా హావభావాలు ఇవ్వగలరో అన్నీ ఆయన్నుంచి వస్తున్నాయి. ఒక పాటలో హీరోయిన్ ఇన్నిసార్లు డ్రస్ ఎలా మార్చుకోగలిగిందని ఆయన నన్ను అడిగాడు. ఇలాంటి చీప్ ట్రిక్స్ ఆయనకు అర్థంకాలేదు పాపం!

అయితే మీరు పాటలకు దూరంగా ఉంటారన్నమాట!

నేనెప్పుడూ ముక్కుసూటిగా మాట్లాడతాను. దీంతో చాలా మంది నాకు పొగరన్నారు. వింత మనిషిగా చూసిన వాళ్లు ఉన్నారు. 'రాజీపడడం' అనే సిద్ధాంతాన్ని 20-30 శాతం నమ్ముతాను. చివరికి భార్య, పిల్లలతో కూడా రాజీ తప్పదు కదా! రాజీ పడిన ఈ కొద్దిపాటి శాతంలో నిర్మాతను సంతృప్తి పరచడానికి పాటలు, ఫైట్స్ పెడుతుంటాను. ఇలాంటి సినిమా ఫెయిల్ అయినా... హిట్ అయినా ఒకటే చెబుతాను. నేనొక స్టుపిడ్ సినిమా తీశాను... ఆడియన్స్ ఒక స్టుపిడ్ సినిమా చూశారని.

ఫైట్స్‌పై మీ అభిప్రాయం...

సహజంగా ఉండాలి. బహుళ అంతస్థు భవనం నుంచి హీరో దూకితే ప్రేక్షకులు ఇష్టపడతారని స్టంట్ మాస్టర్ అనుకుంటాడు. కానీ ఇది సరైంది కాదు. ప్రేక్షకులు తెలివితక్కువ వాళ్ళేమీ కాదు. అసహజమైన సన్నివేశాన్ని చూసి నవ్వుకుంటారు తప్ప ఎంజాయ్ చేయరు. 'త్రీ'లో నేచురల్‌గా ఉండేలా ఫైట్ మాస్టర్స్ రామ్-లక్ష్మణ్ తగు శ్రద్ధ తీసుకుని కంపోజ్ చేశారు.



ఎ ఫిల్మ్ బై అరవింద్ చిత్రంలో రిషి, రాజీవ్ కనకాల, మోనాచోప్రా

తెలుగు సినిమా చరిత్రలో తొలిసారి బెలూన్ లైట్స్ వాడారు. వాటి పనితనం ఎలా ఉంటుంది?

సాధారణంగా నైట్ షూటింగ్‌లో నాలుగైదు లైట్లు వాడతాం. ముందుగా వీటిని అనువైన స్థలాల్లో అమర్చాలి. అయినా వీటి నుంచి క్రమ పద్ధతిలో లైటింగ్ రాదు. అదే చాలా దూరం వరకూ లైటింగ్ ఎఫెక్ట్ కావాలంటే బెలూన్ లైటింగ్ బాగా ఉపయోగపడుతుంది.

'త్రీ'కి హాలీవుడ్ చిత్రం ప్రేరణా?

హైదరాబాద్‌లో జరిగిన యదార్థ సంఘటన ఆధారంగా రూపొందించినదని ముందే చెప్పాను కదా.. ఈ ఘటనలో నేనూ భాగస్వామినే. కాకపోతే ఫ్రెంచ్, హాలీవుడ్ చిత్రాల నుంచి టెక్నాలజీ తీసుకున్నాను. స్టోరీ మాత్రం కాపీ కాదు. 'త్రీ' ఒరిజినల్ కథ అని గర్వంగా చెప్పగలను. చూస్తే మీరే నమ్ముతారు.

బాక్సాఫీస్ వద్ద 'ఎ ఫిలిం బై అరవింద్' రిజల్ట్?

సినిమా నిర్మాణ ఖర్చు కోటి ఎనభై లక్షలైంది. పెట్టిన పెట్టుబడి ప్రొడ్యూసర్‌కి వచ్చింది. డిస్ట్రిబ్యూటర్స్, ఎగ్జిబిటర్స్ కూడా సేఫ్.

మీ కజిన్ ఇంద్రగంటి మోహన్‌కృష్ణ దర్శకత్వం గురించి...

సినిమాల్లో మన తెలుగు లిటరేచర్‌ని సరిగ్గా ఉపయోగించుకోలేదేమో అనిపిస్తుంటుంది! హాలీవుడ్‌లో చాలా చిత్రాలు నవలలు, సాహిత్యం ఆధారంగా రూపొందుతున్నవే. ఇదే దారిలో ఇంద్రగంటి మోహన్‌కృష్ణ పయనించారు. చలం రచన 'మైదానం' ఆధారంగా 'గ్రహణం' తీశారు. ఈ సినిమా విమర్శకుల ప్రశంసలందుకున్నందుకు ఆనందంగా ఉంది.

దర్శకుడు విద్యావంతుడై వుండడం సినిమా రూపకల్పనలో ఎంతవరకు దోహదపడుతుంది?

విద్యావంతుడైన దర్శకుడు సెన్సిబుల్ చిత్రాన్ని తీయగలడు. దర్శకుడికి కనీస విద్యార్హత ఉండాలి. అటువంటి దర్శకుల నుంచి మెరుగైన టెక్నాలజీతో చిత్రాలు మన తెలుగులో వస్తున్నాయి.

మీ తదుపరి ప్రాజెక్ట్?

థ్రిల్లర్ చిత్రాలపై మంచి పట్టుంది. అందుకే 'ఎ ఫిలిం బై అరవింద్' అనే సస్పెన్స్ థ్రిల్లర్, 'త్రీ' అనే సైకలాజికల్ థ్రిల్లర్ తీశాను. తదుపరి చిత్రం యాక్షన్ థ్రిల్లర్‌గా ఉంటుంది.

బూరలు పట్టే ఆట

హాయ్ బుజ్జాయిలూ... సెలవులన్నీ అయిపోయి స్కూళ్లు తెరిచేశారు. ఇంక మీరంతా బిజీ బిజీ. స్కూళ్లు, హోంవర్కు, చదువు... కదా. కానీ బాలనేస్తాలు వుండగా మీకు రొటీన్ అన్న ప్రశ్నే వుండదు. ఇదిగో ఇవాళ మీకోసం ఒక ఆట తీసుకొచ్చాం. అదేంటంటే 'బూరలు పట్టే ఆట'. పేరు వినడానికి తమాషాగా వున్నా... ఆడుతుంటే మాత్రం భలే మజాగా వుంటుందిలే. మరి మొదలెట్టేద్దామా!

ఏమేం కావాలంటే... మీలాంటి చిన్నారులు, గ్యాస్ బూరలు, పెద్దవారొకరు.

సమయం: 10 నిముషాలు

ఎలా ఆడాలంటే... ముందుగా గ్యాస్ బూరలు కొనుక్కోవాలి. అవే ఎందుకంటే... గదిలో వదిలితే పైన అటక్కి తాకుతూ... అలా కదులుతుంటాయి. వాటికి దారాలు కొంచెం పొడవుగా కట్టాలి. ఎంత పొడవుగా అంటే మీలాంటి పిల్లలు ఎగిరితే అందేంత పొడవుగా అన్నమాట. అయితే ఇక్కడ ఒక విషయం మర్చిపోకూడదు. కొన్ని బూరలకు పొట్టి దారాలు కట్టాలి. పొడవాటి పిల్లలుంటారుకదా. వాళ్లు పట్టుకోవడానికి!

పెద్దవాళ్లు సరిగ్గా 'రెడీ' అన్నాక ఆట మొదలవుతుంది. గదిలో పైన వేళ్లాడుతున్న బూరలను పిల్లలంతా ఎగిరి పట్టుకోవాలి. పెద్దవాళ్లు సరిగ్గా పది నిముషాలయ్యాక 'స్టాప్' అంటారు. ఈ లోపు ఎవరైతే ఎక్కువ బూరలు సంపాదిస్తారో వారు గెల్చినట్టు. ఇలా ఎంతసేపైనా ఆడుకోవచ్చు. బావుందికదూ బూరలు పట్టే ఆట. మరి గ్యాస్ బూరలు అమ్మే అబ్బి వచ్చినప్పుడు కొనుక్కొని ఈ ఆట ఆడుకోండే. మరి పై వారం వరకు టాటా!

– సాహిల్

పేర్లు రాయండి చూద్దాం

మీరు ఇంగ్లీషులో దడదడలాడించేస్తారంటకదా. అయితే ఈ బొమ్మలో నాలుగు సముద్ర జీవులున్నాయి. వాటి పేర్లేంటో ఆంగ్లంలో రాయండి చూద్దాం.





సరైన దారి ఏదబ్బా...

హాయ్ బుజ్జాయిలూ... ఈ పక్షి లోపల బోలెడన్ని గజిబిజి దారులున్నాయి. 'లోపలికి' అని వున్న దగ్గర బయలుదేరి 'బయటికి' అని వున్న దగ్గరకి రావాలి. మరి మీ తెలివితేటలు వుపయోగించి చూడండీ...

రంగులు పులిమేద్దాం



హేయ్! మీకెంతో ఇష్టమైన రంగులను బయటకు తీసేసి... పై బొమ్మలు చుక్కలున్న భాగాల్లో అద్దండి. చివరికి ఏం కనిపిస్తుందో చూడండి.



ఆరు తేడాలు ఏవోచ్

చిన్నారులూ... ఈ ఇద్దరు పిల్లలూ చూడ్డానికి ఒకేలా కనిపిస్తున్నా! సరిగ్గా ఆరు తేడాలున్నాయి. వాటిని చకచకా కనిపెట్టి సున్నా చుట్టండే.

లీకైన పైపు ఏది?

ఇక్కడ మూడు పైపులున్నాయి. అందులో ఒక పైపు లీకై నీళ్లు కారిపోతున్నాయి. దాన్ని బాగుచేయడానికి వచ్చిన వ్యక్తికి ఒకటే ఆలోచన. ఇంతకీ ఏ పైపు పగిలిందీ అని. ఇంతకీ ఏ పైపు కట్టేస్తే నీళ్లు లీకవకుండా ఆపొచ్చు?!



(సమాధానం : రెండవ పైపు)

పదంలో పదం

పిడుగులూ... ఈ బొమ్మలో ఐదు వస్తువులున్నాయి. వాటిని మీరు పైన వున్న బాక్సుల్లో ఆంగ్లంలో రాయాలి. అంతటితో మీ పని అయిపోయిందనుకోకండి. ఆ పదాల్లో ఇమిడి వున్న మరో ఐదు పదాలను కింది బాక్సుల్లో రాయండి. సరేనా! అయితే ఆఖరుకు మా సమాధానం కూడా చూడండే.

సమాధానం: a) hatchet (hat), b) hammer (ham), c) grapes (apes), d) shoe (hoe), e) scarf (car).

అట్టమీది కథ

ఎం.కోటేశ్వరరావు



ఒబామా

ఈ ఏడాది జనవరిలో అమెరికా పౌరుల ముందుకు ఒక ప్రశ్న వచ్చింది. రెండువందల ముప్పై సంవత్సరాల స్వాతంత్ర్య చరిత్రలో తొలిసారిగా ఒక మహిళను అధ్యక్ష స్థానానికి ఎన్నుకోవాలా? లేక ఒక నల్లజాతీయుడిని గద్దెనెక్కించాలా? అన్నదే అది. అయితే ఆ ప్రశ్న ప్రస్తుతం ప్రతిపక్షంగా ఉన్న డెమోక్రటిక్ పార్టీ ప్రతినిధులకే పరిమితమైంది. ఆ పార్టీ తరపున ఈ ఏడాది నవంబరులో జరిగే అధ్యక్ష ఎన్నికల్లో అభ్యర్థిగా హిల్లరీ క్లింటన్, బరాక్ ఒబామాల్లో ఎవరు ఉండాలన్న పోటీలో చివరకు బరాక్ ఒబామాకే మెజారిటీ మద్దతు పలికారు. దాంతో ఒక నల్లజాతీయుడిని అధ్యక్షుడిగా ఎన్నుకోవటమా లేదా అన్న సమస్య ఇప్పుడు మొత్తం అమెరికా ప్రజానీకం ముందుంది.

శ్వేత సౌధంలో మేఘశ్యాముడా!

అసలు ఇలాంటి చర్చ జరగటం నిజానికి అమెరికా పౌరసమాజానికే మచ్చ. అయితే ఈ సందర్భంగా అక్కడున్న జాతి వివక్ష, అహంకారం మరోసారి ప్రపంచం ముందు వెల్లడైంది. డెమాక్రటిక్ పార్టీ తరఫున ఒబామా అభ్యర్థిగా ఖరారైన తరువాత ప్రజాభిప్రాయ సేకరణలో రిపబ్లికన్ పార్టీ అభ్యర్థి మెకెయిన్ కంటే ఒబామా స్వల్పతేడాతో రేసులో ముందున్నారు. అది చివరి వరకు నిలుస్తుందా? ఒబామా గద్దెనెక్కుతాడా? ఎన్నికైతే ఏం జరుగుతుంది? వివక్షనెదుర్కొంటున్న నల్లజాతీయులకు ఏం ఒరుగుతుంది? రిపబ్లికన్ల కంటే భిన్నంగా పాలన ఉంటుందా? అన్నది మిలియన్ డాలర్ల ప్రశ్న. ఎన్నికల ప్రచారం ప్రారంభమైంది కనుక అమెరికాలో దిగజారుతున్న పరిస్థితుల గురించి ఉభయులూ తమ వాగాడంబరాన్ని ప్రదర్శించనున్నారు. అగ్నికి ఆజ్యం తోడైనట్లు మీడియా ఉండనే ఉంది. జనాన్ని ఒక విధమైన భావోద్వేగ స్థితికి తీసుకుపోతుంది. దాంతో ఓటర్లకు ఆలోచించుకొనే అవకాశం ఉండదు. అమెరికన్లను అధోగతికి నెట్టడంలో రెండుపార్టీలు తమశక్తి మేరకు పని చేస్తాయి. జాత్యహంకారం నరనరానా ఉన్న అమెరికా సమాజంలో ఒక నల్లజాతీయుడు అభ్యర్థిగా ఎంపిక కావటం నిస్సందేహంగా ఆహ్వానించదగిన పరిణామమే అయినప్పటికీ ఆ ఎన్నిక అమెరికా సామ్రాజ్యవాద చట్ర పరిధిలోనే అన్నది గుర్తుంచుకోవాలి. ఇప్పటివరకు అమెరికా 43 మంది అధ్యక్షులను చూసింది. వారిలో డెమాక్రటిక్ పార్టీ వారు 15 మంది. రిపబ్లిక్ పార్టీ వారు 18 మంది ఉన్నారు. 44వ అధ్యక్షుడిగా ఒబామా ఎన్నికైతే అమెరికా చరిత్రలో ఒక రికార్డు అవుతుంది. అంతేకాదు పిన్నవయస్కులైన అధ్యక్షుల్లో నాల్గవ వ్యక్తి అవుతారు! ఒక వేళ మెకెయిన్ ఎన్నికైతే వృద్ధ అధ్యక్షుడిగా రికార్డుల కెక్కుతాడు. అందుకు ఒకడుగు దూరంలో అమెరికన్ ఓటర్ల ముందు బ్యాలట్‌బాక్సులున్నాయి.

చక్కటి అవకాశం!

పచ్చిమితవాద రిపబ్లికన్ పార్టీని గద్దె దించటానికి ఎన్నికలను ఒక అవకాశంగా అమెరికా కమ్యూనిస్టులు, వామపక్ష వాదులు భావిస్తున్నారు. డెమాక్రాట్ల అధ్యక్ష అభ్యర్థి రేసులో మిలియన్ల మంది యువకులు ఓటు చేయటం రిపబ్లికన్లపై వ్యతిరేకతకు సూచికగా పేర్కొంటున్నారు. అయితే కమ్యూనిస్టులు ఏ ఒక్క అభ్యర్థిని బలపరచలేదు. బుష్, మితవాద వ్యతిరేక భావాలతో ఉన్నవారికి మద్దతు ఇస్తామని తద్వారా అలాంటిశక్తులు చురుకుగా పని చేస్తాయని కమ్యూనిస్టుపార్టీ పేర్కొన్నది. ఒబామా ప్రచారం ఓటర్లను ఆకర్షించటం నవంబరు ఎన్నికల్లో అధికార మార్పిడికి ఒక సందేశం లాంటిదని, ఎన్నికల్లో రిపబ్లికన్ అభ్యర్థి ఓటమికి పని చేస్తామని తెలిపింది. రానున్న కాలంలో ఒక స్వతంత్ర 'ప్రజాపార్టీ' ఏర్పాటై అన్ని రకాల ప్రజాతంత్ర శక్తులు, కార్మికులను ఐక్యపరచాలని తాము వాంఛిస్తున్నట్లు పేర్కొన్నది.

ఒబామా గురించి...

హిల్లరీ క్లింటన్‌ను ఓడించటం ద్వారా సెక్సిజాన్ని దెబ్బతీశారని అయితే రేసిజం (జాత్యహంకారం)ను ఓడించటం అంతతేలిక కాదని పరిశీలకులు చెబుతున్నారు. నాలుగేళ్ల క్రితం ఒక సభలో అనర్గళంగా ప్రసంగించి సభికులను ఆకట్టుకున్న బరాక్ ఒబామా ఇల్లినాయిస్ నుంచి సెనేట్‌కు ఎన్నిక కావటం తప్ప రాజకీయ నేపథ్యం లేదు. అనుభవరాహిత్యం అమెరికాలో పోటీకి అనర్హత కాదని నిరూపించాడు. కెన్యా తండ్రికి, కాన్సాస్‌కు చెందిన తెల్లవనితకు పుట్టిన ఒబామా హవాయి, ఇండోనేషియాలో ఎక్కువ కాలం పెరిగాడు. చికాగోలో న్యాయవాదిగా పని చేశాడు. అత్యంత పిన్నవయస్సులో(46) పోటీ చేస్తున్నవారిలో నాలుగోవ్యక్తి. నిజంగా ఎన్నికైతే ఒక రాజకీయ అనుభవరహితుడు వైట్‌హౌస్‌లో అడుగిడి చరిత్ర సృష్టించినట్లే.

శ్వేతజాతి ఆధిపత్యం ఉన్న అమెరికాలో కేవలం పన్నెండు శాతం మంది మాత్రమే ఉన్న ఆఫ్రో-అమెరికన్ల నుంచి ఇంతవరకు ఒక్క అభ్యర్థికూడా ఎన్నికల్లో నెగ్గలేదు. ఇప్పుడు ఒక ప్రధాన పార్టీ అందునా విజయం సాధించే అవకాశాలున్నట్లు భావిస్తున్న తరుణంలో ఒక శ్వేతేతరుడ్ని అభ్యర్థిగా ఎన్నుకోవటానికి దారి తీసిన భౌతిక పరిస్థితులేమిటి?

ఒబామానే ఎందుకు?

అమెరికన్ సమాజంలో పీడితుల్లో ఆఫ్రో-అమెరికన్లే మొదటివారు. ఇదే సమయంలో వీరిలో కొందరు వాణిజ్య, వ్యాపార రంగాల్లో రాణించటం, క్రీడల్లో, వినోద రంగాల్లో ప్రతిభను కనపరచటం నానాటికీ పెరుగుతోంది. ఇదే సమయంలో ఈ తరగతికి చెందిన కండోలిజా రైస్ లాంటి వారిని కీలకమైన విదేశాంగ మంత్రులుగా నియమించటం వంటి పరిణామాలు కూడా చోటు చేసుకున్నాయి. అలాంటి వారు అమెరికా సామ్రాజ్యవాదం, బహుళజాతి గుత్త సంస్థల ప్రయోజనాలను కాపాడటంలో ఏ శ్వేత జాతీయుడు, లేదా జాతీయరాలికి తీసిపోలేదు. అది ఇరాక్‌పై దాడి, దురాక్రమణ, పాలస్తీనా సమస్య, ఇరాన్‌పై దాడికి కాలుదువ్వటం వంటి అనేక అంశాల్లో రుజువైంది. అందువలన పాలకవర్గానికి తమ పరిధిలో ఉండే ఏ రంగువారైనా అభ్యంతరం ఉండాల్సిన అవసరం

డెమోక్రటిక్-రిపబ్లికన్ పార్టీ

ఈ పేరు వింటే ఆశ్చర్యంగా ఉంది కదూ! అమెరికా చరిత్ర చదువుకున్న వారికి దీని గురించి చెప్పనవసరం లేదు. ప్రారంభంలో అంటే 1792 నాటి ముచ్చట. అప్పుడు అమెరికాలో ఉన్నది ఒకే పార్టీ అది రిపబ్లికన్ పార్టీ. పార్టీలో ప్రజాస్వామ్య విధానాలు ఉండాలని కోరినవారికి మితవాదులు 'డెమొక్రాట్స్' అని వ్యంగ్యంగా పేరు పెట్టారు. చివరికి అంటే 1824లో రిపబ్లికన్ పార్టీలో చీలిక వచ్చింది. విడిపోయిన వారితో డెమొక్రటిక్ పార్టీ 1832లో ఆవిర్భవించింది. అంతేకాదు మరో విచిత్రం ఏమంటే ఆ రెండు పార్టీలకు ఇప్పుడు ఎన్నికల గుర్తులుగా ఉన్న గాడిద, ఏనుగులుగా మారటానికి ఒక కార్టూనిస్టు వేసిన వ్యంగ్య కార్టూన్లు అన్న విషయం చాలా మందికి తెలియదు. రిపబ్లికన్ పార్టీ మద్దతుదారుడైన ఆ కార్టూనిస్టు తన పార్టీ గొప్పతనానికి ఏనుగును ఉపయోగించి ప్రత్యర్థి పార్టీని గేలి చేసేందుకు గాడిదను వినియోగించారు. 1828లో అధ్యక్ష ఎన్నికల సందర్భంగా ఆండ్రూ జాక్సన్ అనే అభ్యర్థిని ఒక రాజకీయ కార్టూన్‌లో మొగ గాడిదపై ఎక్కి దానికి ఎటు పోవాలో సూచనలిస్తున్నట్లు చిత్రించారు. తరువాత 1870 థామస్ నాస్ట్ అనే కార్టూనిస్టు డెమొక్రటిక్ పార్టీ గురించి వేసిన ఒక వ్యంగ్య కార్టూన్‌లో చచ్చిన సింహాన్ని బతికున్న గాడిద తన్ని తగలేసిందన్నట్లుగా చిత్రించాడు. అప్పటి నుంచి గాడిద గుర్తు డెమొక్రాట్లకు చిహ్నంగా మారిపోయింది. 1854లో డెమొక్రటిక్ పార్టీ విధానాలను రిపబ్లికన్ పార్టీ అనే ఏనుగు తుత్తునియలు చేసిందన్నట్లుగా అదే థామస్ నాస్ట్ ఒక పత్రికలో చిత్రించాడు. అప్పటి నుంచి రిపబ్లికన్లంటే ఏనుగుల్లాంటి వారనే ప్రతీతి వచ్చి చివరకు ఏనుగు అధికారిక గుర్తుగా మారిపోయింది. నిజానికి అప్పటికి రెండుపార్టీలకు నిర్దిష్టమైన ఎన్నికల గుర్తులు లేవు. నిజానికి డెమొక్రటిక్ పార్టీ సాంప్రదాయక గుర్తు కోడిపుంజు. రిపబ్లికన్ల గుర్తు గద్ద. ఈ గుర్తులు కూడా రాష్ట్రానికి రాష్ట్రానికి మారిపోయేవి. ఇప్పటికీ కొన్ని రాష్ట్రాల్లో ఈ గుర్తులను వినియోగిస్తున్నారు. మిస్సోరీ రాష్ట్రంలో పదేళ్ల క్రితం వరకు స్వేచ్ఛా ప్రతిమ (స్టాట్యూ ఆఫ్ లిబర్టీ)ని డెమొక్రటిక్ పార్టీ గుర్తుగా స్థానిక ఎన్నికల్లో వినియోగించారు. పార్టీల పతాకాల రంగులను కూడా అధికారికంగా నిర్వచించినవి కావు. మీడియా ప్రాచుర్యంలోకి తెచ్చినవే అంటే ఆశ్చర్యపోవద్దు. డెమొక్రటిక్ పార్టీది నీలం రంగుగా మనకు తెలుసు. 2000 ఎన్నికల్లో ... టీవీలు తమ కార్యక్రమాల్లో ఈ రంగు నేపథ్యాన్ని డెమొక్రటిక్ పార్టీకి వినియోగించటంతో జనం ఆ రంగుతో ఆ పార్టీని గుర్తిస్తున్నారు. అదే విధంగా రిపబ్లికన్ పార్టీని ఎర్రరంగుతో గుర్తిస్తున్నారు. అదే విధంగా 1932లో డెమొక్రటిక్ పార్టీ నాయకుడు రూజ్‌వెల్ట్ ఎన్నిక సందర్భంగా 'హేపీ డేస్ ఆర్ హియర్ ఎగెయిన్' అనే పాటను ఎక్కువగా వినియోగించారు. ఆ ఎన్నికల్లో విజయం సాధించటంతో ఆ పాటతో తమకు విజయం చేకూరిందనే విశ్వాసంతో ఇటీవలి వరకు డెమొక్రాట్లు దాన్ని వినియోగించారు. గత ఎన్నికల్లో డెమొక్రాట్లు 'బ్యూటిఫుల్ డే' అనే పాటను ప్రాచుర్యంలోకి తెచ్చారు.

లేకపోయింది. వివిధ అంశాలపై ఒబామా వెల్లడించిన అభిప్రాయాలను గమనిస్తే అమెరికా శ్వేతజాతీయులు ఎందుకు ఆమోదించారో అర్థం చేసుకోవచ్చు. ఆఫ్రో-అమెరికన్లలో అత్యధికులకు సరైన చదువు సంధ్యలు లేవు. కానీ ఒబామా ఉన్నత వర్గాలకు మాత్రమే అందుబాటులో ఉన్న హార్వర్డ్ లా స్కూల్ వంటి వాటిలో చదవటం, వేషభాషల్లో తెల్లవారితో పోటీ పడటంతో శ్వేతజాతీయులు తమతో సరితూగే అర్హత ఉన్న వాడిగా కూడా భావించారు.

పాలస్తీనియన్లకు చెందాల్సిన జెరూసలెం నగరాన్ని ఇజ్రాయెల్ ఆక్రమించింది. నగరం తమదే అని చెబుతోంది. అమెరికా రాజకీయాలను ప్రభావితం చేసే యూదుల ఆదరాభిమానాలను చూరగొనేందుకు వారి సమావేశంలో మాట్లాడుతూ జరూసలెంను విడదీయరాదని, ఆ నగరం ఇజ్రాయెల్ ఆధీనంలో ఉండాలని చెప్పాడు. దానిపై విమర్శలు రావటంతో ఆ సమస్యను యూదులు-అరబ్బులు పరిష్కరించుకోవాలని తరువాత మాట మార్చాడు. గత ఎనిమిది సంవత్సరాల జూనియర్ బుష్ పాలనపై అమెరికన్లు తీవ్ర అసంతృప్తితో ఉన్నారు. రిపబ్లికన్ పార్టీ అభ్యర్థి జాన్ మెకెయిన్ ప్రపంచంపై ఆధిపత్యం చెలాయించాలన్న బుష్ విధానాలను కొనసాగించాలనే గట్టి మద్దతుదారుడు. ఒబామా కూడా ఆ విధానాలనే కొనసాగించాలని చెబుతున్నాడు. అయితే స్వదేశంలో వాటికి వ్యతిరేకత పెరగకుండా చూసుకోవాలనే ఎత్తుగడ అనుసరించాలని సలహా ఇచ్చాడు. రిపబ్లికన్లు సమాజంలోని ఒక శాతం ధనికులు మరింత ధనికులు కావాలని, అబార్షన్ల వంటి సమస్యలపై పక్కా మితవాదులుగా వ్యవహరిస్తే... ఒబామా పేదలకు భద్రత కల్పించాలని, అబార్షన్లను అంగీకరించాలని చెబుతాడు. రష్యా, చైనాలను ఎదగనీయకుండా చూడాలనటంలో ఇద్దరికీ తేడా లేదు. ప్రపంచంలో అమెరికా ఒంటరి పాటు కాకుండా చూసుకుంటూ తన లక్ష్యాలను సాధించాలని ఒబామా చెబుతాడు, రిపబ్లికన్ అభ్యర్థి మెకెయిన్ పాత మొరటు పద్ధతులే మార్గం అంటాడు. వారి మధ్య తేడా ఎడమ చేయి-పురచేయి వంటిదే.

ఇరాక్ నుంచి దళాలను వెంటనే రప్పించటం అంత అవసరమా అని ప్రశ్నించే పచ్చి యుద్ధోన్మాది జాన్ మెకెయిన్ రిపబ్లికన్ పార్టీ అభ్యర్థిగా ఉన్నారు. వియత్నాంపై దాడిలో గెరిల్లాల దాడిలో గాయపడి చావుకు దగ్గరగా వెళ్లాడు. ఐదేళ్లు వియత్నాంలో యుద్ధ నేరస్తుడిగా జైల్లో ఉన్నాడు. నౌకాదళం నుంచి 1981లో రిటైరైన తరువాత రాజకీయాల్లో ప్రవేశించాడు. అనేక సార్లు రిపబ్లికన్ పార్టీ చెప్పిన అంశాలను కూడా మొండిగా తిరస్కరించిన మెకెయిన్ యుద్ధోన్మాద బుష్ విధానాలను ముందుకు తీసుకుపోయేందుకు తగిన వ్యక్తిగా భావించి అభ్యర్థిగా నిలబెట్టారు.

ఇక ఇరాక్‌పై ఒబామా ఎలా మాట మార్చాడో చూడండి. ప్రచార ప్రారంభంలో ఇరాక్‌పై దాడికి వ్యతిరేకం అన్నాడు. తరువాత 2009 చివరి నాటికి సైన్యాన్ని ఉపసంహరించటం పూర్తి చేస్తానని చెప్పాడు. ఆ తరువాత అధికారం వచ్చాక తానెదుర్కోబోయే సమస్యలు, వాస్తవాలేమిటో తెలియకుండా సైనిక


హిల్లరీ


మెకెయిన్

కొన్ని వాస్తవాలు...

23 లక్షల మంది పేదలు జైళ్లలో మగ్గుతున్నారు. అంటే ప్రతి వందమంది పెద్దవారిలో ఒకరు జైల్లో ఉన్నారు. అదే నల్లవారిలో ప్రతి తొమ్మిది మందిలో ఒకరు జైలు ఊచలను లెక్కిస్తున్నారు. ప్రపంచ జనాభాలో కేవలం ఐదుశాతమంది మాత్రమే జనాభా అమెరికాలో ఉంటే ప్రపంచంలోని ఖైదీల్లో 25శాతం అక్కడి జైళ్లలో ఉన్నారు. గంటకు ఆరేడు డాలర్ల వేతనంతో పని చేసే వారి సంఖ్య ఇబ్బడిముబ్బడిగా పెరుగుతోంది. ఆర్థిక వ్యవస్థ పెరుగుతోందని చెప్పుకుంటున్న సమయంలో దారిద్ర్యరేఖకు దిగువకు చేరి కిలో రెండురూపాయల బియ్యం లాంటి ఆహార కూపన్లు పొందే వారి సంఖ్య ఇటీవల రికార్డు స్థాయిలో పెరిగింది. ❖ ప్రతి డాలరులో 48.5 సెంట్లు 2005లో ధనికులైన పదిశాతం మంది జేబుల్లోకి వెళుతున్నట్లు వెల్లడైంది. ఆ మొత్తం నానాటికీ పెరుగుతోంది. ❖ గత ఎనిమిదేళ్లలో ఎనిమిదిలక్షల ప్రభుత్వ ఉద్యోగాలు రద్దయ్యాయి. జైళ్ల మొదలు అంతా ప్రైవేటీకరణే. బుష్ గద్దెనెక్కినపుడు 32లక్షల ఉద్యోగాలు ఉత్పాదకరంగంలో ఉంటే ఇప్పుడు 25 లక్షలకు పడిపోయాయి. గత మూడు సంవత్సరాల్లో ప్రతి ఐదుగురు కార్మికుల్లో ఒకరిని లేఆఫ్ చేశారు. కోటిన్నర మంది నిరుద్యోగులుగా ఉన్నారు. ❖ రక్షణ ఖర్చు తొలిసారిగా ఈఏడాది లక్ష కోట్లడాలర్లు దాటి చరిత్ర సృష్టించనుంది. రెండవ ప్రపంచ యుద్ధం తరువాత ఇంత పెద్దమొత్తం ఎపుడూ లేదు. ❖ సోవియట్‌పై పైచేయి సాధించాలనే పేరుతో 340 కోట్ల డాలర్లతో తయారు చేసిన జలాంతర్గాములు, 890 కోట్ల డాలర్లతో తయారు చేసిన ఖండాంతర క్షిపణులు పనికిరాకుండా పోయాయి.



ఉపసంహరణ గురించి మాట్లాడటం తెలివితక్కువ తనం అన్నాడు. తన ఎన్నికల ఖర్చు నిమిత్తం 26.5 కోట్ల డాలర్లను సేకరించిన ఒబామా తాను కూడా ప్రైవేటు నిధులను పోగేయగలిగిన సత్తా ఉన్నవాణ్ణని రుజువు చేసుకున్నాడు.

క్యూబాపై నిర్బంధం విషయంలో అక్కడ స్వేచ్ఛ, బహిరంగ ప్రజాస్వామ్యానికి మార్పు జరుగుతున్నదనే విశ్వాసం ఉంటే ఆంక్షలను సడలించాలని మెకెయిన్ చెప్పాడు. క్యూబా అర్థవంతమైన ప్రజాస్వామ్యం దిశగా మార్పు చెందితే వాణిజ్య ఆంక్షలను సులభతరం చేయాలని ఒబామా అన్నాడు. ముందస్తు షరతులు లేకుండా రావుల్ కాస్ట్రోతో చర్చలు జరపాలని చెప్పాడు. ఆంక్షలు కొనసాగుతాయని మియామీ సభలో పేర్కొన్నాడు.

స్వాతంత్ర్యం వచ్చి రెండువందల సంవత్సరాలు దాటినా, అత్యంత ప్రజాస్వామిక దేశం అని చెప్పుకున్నా 1967లో అమెరికా సుప్రీం కోర్టు తెల్లవారు-నల్లవారి మధ్య వివాహాలను అనుమతిస్తూ తీర్పు ఇచ్చేంత వరకు వర్ణ విభజన కొనసాగింది. ఆ దశకం ప్రారంభంలో పెద్ద ఎత్తున సాగిన పౌరహక్కులు, ఓటింగ్ హక్కుల ఉద్యమం, అనేక ప్రాంతాల్లో జరిగిన నల్లజాతీయుల తిరుగుబాట్లు, విధ్వంసకాండ ప్రభావంతో విద్య, ఉపాధి, తదితర రంగాల్లో అనేక మార్పులు వచ్చాయి. నల్లజాతీయుల్లో ఉన్నత, మధ్యతరగతి ఏర్పడింది. ఆ తరగతికి చెందిన వాడే ఒబామా. అణచబడిన జాతిగా ఉన్న తమ సంతతికి చెందిన ఒబామా అధ్యక్ష పదవికి పోటీ పడదాన్ని, అభ్యర్థిగా నిలబడటాన్ని తమకు గర్వకారణంగా భావిస్తున్నారు. ఒబామా విధానాలు తమ జీవితాల మెరుగుదలకు ఉపయోగపడతాయా లేదా అని వారు చూడటం లేదు. గతంలో వివక్షతో వారు పోల్చుకుంటున్నారు.

బుష్ పాలనతో విసిగిపోయిన జనం వారు ఏ రంగువారైనా ముందు మార్పు కావాలని కోరుకుంటున్నారు. అందుకు మహిళైనా, నల్లజాతీయుడైనా ఎవరైనా ఫరవాలేదనే అభిప్రాయం అన్ని రంగుల యువతరంలో కలిగింది. అది కూడా ఒబామాకు తోడ్పడింది. ❄

ఆ రెండు పార్టీలే కాదు...

అమెరికాలో అందరూ అనుకుంటున్నట్లు రెండుపార్టీల వ్యవస్థ రాజ్యాంగబద్ధమైనది కాదు. డెమాక్రాట్, రిపబ్లికన్ పార్టీలేగాక ఇతర పార్టీలు కూడా ఉన్నాయి. అయితే పాలకవర్గం ఆ రెండుపార్టీలను ప్రారంభం నుంచీ ఆరెండు పార్టీలను ఆసరా చేసుకున్నది. మీడియా ఇతర పార్టీలను అసలు పరిగణనలోకి తీసుకోదు. ప్రస్తుత ఎన్నికల్లో గ్రీన్ పార్టీ అభ్యర్థిగా ఒక మహిళ, స్వతంత్ర అభ్యర్థిగా రాల్ఫ్ నాడార్ రంగంలో ఉన్నారు. ఇరాక్, ఆఫ్ఘనిస్తాన్‌లను ఆక్రమించుకోవటం తప్పని మెజారిటీ అమెరికన్లు భావిస్తున్నా ఎన్నికలకు వచ్చేసరికి ఆక్రమణలను సమర్థించే రెండు పార్టీల వెనుకే సమీకృతం అవుతున్నారు. దానికి కారణం కార్మిక, సామాజిక ఉద్యమాలు బలహీనంగా ఉండటం ఒక ప్రధాన కారణంకాగా అలాంటి శక్తులను ఎదగనీయకుండా అణచివేయటంలో రెండుపార్టీలకు బేధం లేదు.

ఆరోగ్యం

కళ్లు తిరుగుతున్నాయా...?

డాక్టర్ శ్రీనివాస్ కిషోర్,
కన్సల్టెంట్ ఇఎన్‌టి సర్జన్,
మెడిసిటి హాస్పిటల్స్, హైదరాబాద్.
ఫోన్ : 98480 18667, 92463 6400

కళ్లు తిరగడాన్ని చాలా మంది వ్యాధిలా భావిస్తారు. కానీ ఇది వ్యాధి లక్షణం. జ్వరానికి కారణాలెన్ని వుంటాయో కళ్లు తిరగడానికీ అన్ని కారణాలుంటాయి. ఇంగ్లిష్‌లో దీన్ని వర్టిగో అంటారు.

రెండు కారణాల వల్ల కళ్లు తిరుగుతాయి. అవి సెంట్రల్, పెరిఫెరల్. సెంట్రల్ అంటే మెదడు, వెన్నుపూస... పెరిఫెరల్ అంటే కళ్లు, చెవులు, కాళ్లకు సంబంధించినవి. సమాచారం కోసం మన మెదడు చెవులపై, కళ్లపై ఆధారపడుతుంది. మనం భూమికి ఎంత దూరంలో వున్నాం, ఏ దిశలో వున్నామనేది కళ్లు, కాళ్లు, చెవుల నుంచి సమాచారాన్ని ప్రాసెస్ చేసి మెదడు చిన్న మెదడుకు చేరవేస్తుంది. అక్కడి నుంచి పెద్ద మెదడుకు చేరుతుంది. పెద్ద మెదడు నుంచి విద్యుత్ సంకేతాలు కాళ్లకు వెళ్తాయి. దీని వల్ల కాళ్ల కండరాలకు ఎంత బలం అవసరమనేది శరీరానికి తెలుస్తుంది. దీన్నే స్పేషియల్ ఓరియెంటేషన్ అంటారు. మనం తప్ప! మిగతా జంతువులన్నీ నాలుగు కాళ్లపై నడుస్తున్నాయి. రెండు కాళ్లమీద నడవడంవల్ల వెన్నుపూస, చెవులు, కళ్ళు, కాళ్లలోనూ కొన్ని మార్పులు సంభవించాయి. ఆ వివరాలేమిటో చూద్దాం...!

చెవిలో బ్యాలెన్స్ చేయడానికి రెండు భాగాలుంటాయి. ఒకటి సెమీ సర్కిల్ కెనాల్ లాగా, రెండోది సంచిలాగా ఉంటుంది. ఈ రెండూ కలిపి మన శరీరాన్ని గురుత్వాకర్షణతో పోల్చి ఏ స్థాయిలో ఉందన్న సమాచారాన్ని మెదడకు చేరవేస్తాయి. ఈ సర్కిల్స్ మూడు భాగాలుగా 45 డిగ్రీల కోణంలో విభజింపబడి వుంటాయి. పడుకున్నప్పుడు ఒక సర్కిల్ గురుత్వాకర్షణ ఏ దిశలో ఉందన్న సమాచారం మెదడుకు చేరుతుంది. సెమి సర్కిల్ కెనాల్స్‌లో, బ్యాగ్‌లో ఒక ద్రవం ప్రవహిస్తుంది. దీంతోపాటు కొన్ని కాల్షియం స్ఫటికాలుంటాయి. గురుత్వాకర్షణతోపాటు ఏ దిశలో ఉన్నాయనేది చాలా ముఖ్యమైంది. ఇందులో గందరగోళం జరిగితే మెదడుకు తప్పుడు సమాచారం వెళ్తుంది. నిల్చున్నా పడుకున్నామనే సమాచారం మెదడుకు అందుతుంది. దీంతో కాళ్లకు బలం తక్కువౌతుంది. చెవిలో ఉండే స్ఫటికాలు, సెమి సర్కిల్ కెనాల్స్, సంచుల మధ్య సమతుల్యం దెబ్బతింటే తల తిరగడమనే సమస్య ఏర్పడుతుంది. తల తిరగడమనేది రెండు రకాలు. ఒకటి రొటేటరీ వర్టిగో, నాన్ రొటేటరీ వర్టిగో.

రొటేటరీ వర్టిగో

మనిషి కూర్చున్నప్పుడు కళ్లు తిరిగి చుట్టూ వున్నవన్నీ తిరుగుతున్నట్లు, పడిపోతున్నట్లు అనిపిస్తుంది. ఈ రెండు విషయాలను పేషెంట్ స్పష్టంగా చెబితేగానీ చికిత్స చేయడం వీలు కాదు. పడిపోతున్నట్లు అనిపిస్తే వ్యాధి లేనట్లే. చుట్టుపక్కలున్న భూమి, ఇతర వస్తువులు తిరిగిపోతుంటే వ్యాధిగా భావించాలి. దీన్ని రొటేటరీ వర్టిగో అంటారు. ఈ సమస్యకు చాలా వరకు చెవిలోనే కారణాలుంటాయి. చెవిలో ద్రవం ఉత్పత్తి కావడం, డ్రైనేజ్‌లో సమస్యలు రావడం, చెవికి ఇన్‌ఫెక్షన్ వచ్చి బ్యాలెన్సింగ్ చేసే అవయవాలు దెబ్బతినడం, ప్రమాదాల్లో చెవికి దెబ్బతగలడం వల్ల సమస్యలొస్తాయి. చెవిలోని ద్రవం ఉత్పత్తి, డ్రైనేజ్‌లో అసాధారణ మార్పులను మినియర్ సిండ్రోమ్ అంటారు. చెవిలో మూడు గదులుంటాయి. వీటిని ఎ,బి,సిలుగా విభజిస్తే... ఎ, సి గదుల్లోని ద్రవం ఒకటిగా వుంటుంది. 'బి'లో వేరుగా వుంటుంది. ఏదైనా సమస్య వల్ల ఈ గదుల్లోని ద్రవాలు కలిస్తే విపరీతంగా కళ్లు తిరుగుతాయి.

వైరస్, బ్యాక్టీరియా వల్ల చెవిలో ఇన్‌ఫెక్షన్ కలుగుతుంది. సాధారణంగా చెవిలోని కర్ణభేరికి రంధ్రంపడి చీము కారుతుంటుంది. అలాంటి వాళ్లకు ఈ ఇన్‌ఫెక్షన్ వస్తుంది. దీని వల్ల మెదడుకు సమచారం వెళ్లదు. దీనికి చికిత్స.. చెవిలోని చీమును తొలగించడం, యాంటి బయాటిక్స్ వాడటం. ఇదే కాక చెవికి బలమైన దెబ్బ తగలడం. చెవికి దెబ్బతగలడం రెండు రకాలు. ఒకటి పొడవు, మరొకటి అడ్డం. ఎముక డైరెక్షన్‌కు సమానంగా దెబ్బతగిలితే పెద్దగా సమస్యలుండవు. ఎముకకు అడ్డంగా ఫ్రాక్చరై బ్యాలెన్సింగ్ అపయవాలు దెబ్బతింటే విపరీతంగా కళ్లు తిరుగుతాయి. అంతేకాక వికారం, వాంతులు రావడం, చెవిలో వివిధ రకాల శబ్దాలు వినపడడం, నిలబడకపోవడం జరుగుతాయి. ఈ సమస్యలుంటే కనీసం మూడు వారాలపాటు బెడ్ రెస్ట్ తీసుకోవాలి. ఎందుకంటే ఈ లక్షణాలున్న వారు నిలబడి ఏ పనీ చేయలేరు.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు...

ఎటూ కదలకుండా ఫ్లాట్‌గా పడుకోవాలి, వీలైనంత వరకు తిరగకూడదు, లేవకూడదు. చుట్టుపక్కల వస్తువులన్నీ తిరుగుతున్నట్లు అనిపిస్తే పడుకోవడం మంచిది. వీలైనంత త్వరగా డాక్టర్‌ను సంప్రదించాలి.

పెద్దవారిలో మధుమేహం, విటమిన్ బి12 లోపం ఉన్నవారికి కాళ్లలోని నరాలు సరిగ్గా పనిచేయవు. దీంతో కాళ్ల నుంచి మెదడుకు సమాచారం వెళ్లదు. తప్పటడుగులు వేయడం, పడిపోయినట్లు అనిపించడం జరుగుతాయి.

కళ్లు ఒక పాయింట్ ఫోకస్ చేయలేకపోయినా, కళ్ల నుంచి మెదడుకు వెళ్లే నరాల్లో సమస్యలున్నా కళ్లు తిరుగుతాయి.

జాగ్రత్తలు....

కదలకుండా ఏ పొజిషన్‌లో ఉన్నామో అదే పొజిషన్‌లో వుండాలి.

కళ్లు తిరగడమనే సమస్యకు మూడు నుంచి ఆరు నెలల పాటు చికిత్స చేయాలి. ఏ కారణం వల్ల సమస్య వచ్చిందో.. ఆ కారణాలు చాలా రోజుల నుంచి వుంటాయి. లక్షణాల దశ మారితే ఈ సమస్య వస్తుంది. ఈ సమస్య ఉన్న వారు వాహనాలు నడపకూడదు. ఎత్తయిన ప్రదేశాలకు వెళ్లకూడదు. పిల్లల్లో చెవికి సంబంధించిన ఇన్ఫెక్షన్ గానీ, చెవికి దెబ్బలు తగిలినప్పుడు వెంటనే ఇఎన్‌టి వైద్యుని దగ్గరకెళ్లి చికిత్స చేయించుకోవాలి.

ముదురు

ఒట్టమ్మా...! వాణ్ణి నేను కొట్టలేదు. కొరికానంతే...!



విజ్ఞాన వీచిక

మనిషి శరీరానికి ఎంత నీరు కావాలి?

ఎస్. వెంకట్రావు

ఆహారం విషయంలో మనలో చాలా మందికి చాలా అపోహలుంటాయి. మనిషి ఎటువంటి ఆహారం తీసుకోవాలి, ఎంత ఆహారం తీసుకోవాలి అన్నది శరీరం యొక్క పరిమాణం మీదా, అతను చేసే పనిమీద, నివశించే ప్రదేశపు శీతోష్ణస్థితిమీదా, అతని ఆరోగ్య పరిస్థితి మీదా ఆధారపడి ఉంటుంది. శరీర ధర్మశాస్త్రాన్ని శాస్త్రీయంగా అర్థం చేసుకున్నప్పుడు ఆహారం విషయంలో అపోహలకు పోకుండా సరైన ఆహారం తీసుకోగలుగుతాము. అలా కాకుండా అశాస్త్రీయ ఆహార నియమాలను పాటిస్తే మన ఆరోగ్యానికి హానికరమే కాకుండా ఒక్కోసారి ప్రాణానికే ప్రమాదం వస్తుంది. మంచి నీరు కూడా మన ఆహారంలో ఒక భాగమే. అందువల్ల మనం తాగే నీటి విషయంలో కూడా శాస్త్రీయంగా ఉండకపోతే చాలా ప్రమాదాలు జరుగుతాయి.



మనకి కావలసిన నీరు ఎంత అన్న దానిపై శాస్త్రవేత్తలు చాలా పరిశోధనలు చేశారు. చాలా శాస్త్రీయమైన విషయాలు చెప్పారు. మనకు కావలసినదానికన్నా తక్కువ నీరు తీసుకుంటే శరీరం తట్టుకోలేదు. డీహైడ్రేషన్ వల్ల ప్రమాదం ఏర్పడుతుంది. అనేక సందర్భాల్లో ప్రాణాలు కూడా పోతాయి.

మంచి నీళ్లు ఎక్కువగా తీసుకుంటే శరీరానికి మంచిది అనే భావం చాలా మందిలో ఉంది. అది కూడా తప్పు. అంతేకాదు కావలసిన దానికన్నా ఎక్కువ తీసుకోవడం వల్ల ప్రయోజనం లేకపోగా ఒక్కోసారి అనవసరమైన రుగ్మతలకు దారితీస్తుంది. మనకు కావలసిన దానికన్నా ఎక్కువ నీరు తీసుకుంటే డైల్యూషనల్ హైపోనేట్రీమియా, లేక హైపోటోనిక్ హైడ్రేషన్ అనే రుగ్మతకు లోనై కొన్ని సందర్భాల్లో మరణానికి కూడా దారి తీస్తుంది. అందువల్ల మంచి నీరు ఎంత తీసుకోవాలి అన్న దాంట్లో అశాస్త్రీయతకు చోటివ్వకూడదు.

మరి ఒక మనిషికి ఎంత నీరు అవసరం?

అందరికీ ఒకే కొలబద్ద ఉండదు. మనిషి బరువును బట్టి నీటి వినియోగం ఉంటుంది. చిన్న పిల్లలకూ, పెద్దలకూ, శరీరం తక్కువగా ఉన్నవారికీ, ఎక్కువ ఉన్న వారికీ ఒకే పరిమాణంలో నీరు తీసుకుంటే కుదరదు. ఆయా శరీరాలను బట్టి నీరు తీసుకోవాలి. అలాగే వేసవి కాలం మన శరీరాన్ని చల్లబరచడానికి శరీరంలోని కూలింగ్ యంత్రాంగం పనిచేస్తుంది. అప్పుడు సాధారణ సమయంలో కంటే ఎక్కువ నీరు అవసరం. అనారోగ్యంతో ఉన్నప్పుడు ముఖ్యంగా అతిసార వ్యాధితో బాధపడుతున్నప్పుడు నీళ్లు ఎక్కువ అవసరం అవుతాయి. అలాగే మనం తీసుకునే ఆహారంలో లవణాలు అధికంగా ఉంటే సాపేక్షంగా నీళ్లు ఎక్కువ తీసుకోవాల్సి ఉంటుంది. బాగా శరీర కష్టం చేసినప్పుడు, లేక ఆటలాడేటప్పుడు ఎక్కువ నీరు అవసరం, ఎసి గదిలో కూర్చుని పనిచేసుకుంటే నీటి వినియోగం తగ్గుతుంది. అందువల్ల మనిషికి నీరు ఎంత అవసరం అనేది అనేక సందర్భాల మీద ఆధారపడి ఉంటుంది. ఈ సందర్భాలేవీ పరిగణనలోకి తీసుకోకుండా మనిషి ఎక్కువగా నీరు తాగాలనీ, లేక తక్కువగా తాగాలని అనడం అశాస్త్రీయం అవుతుంది.

నిజానికి సాధారణ స్థితిలో మనం ఎంత నీరు తాగాలో మనం నిర్ణయించుకోనక్కర లేదు. లేక పట్టికలు వేసుకునో, కొలతలు కొలుసుకునో తాగనక్కర లేదు. ఎందుకంటే మన శరీరమే తనకు నీరు కావాలో వద్దో నిర్ణయించుకుని అడుగుతుంది. మన ఒంట్లో ఉండాల్సిన దానికన్నా తక్కువ నీరు ఉంటే దాహం వేస్తుంది. నీటి అవసరం తీరిపోగానే దాహం తీరిపోతుంది. ఎండలో తిరిగితేనో, బాగా వ్యాయామం చేస్తేనో, కష్టపడి పనిచేస్తేనో లేదా అతిసార వంటి వ్యాధులు వస్తేనో శరీరం నుండి నీరు త్వరగా బయటకు పోయి నీటి పరిమాణం తగ్గుతుంది. అప్పుడు దాహం పుడుతుంది. కావలసిన నీరు తాగ్గానే దాహం తీరుతుంది. అయితే మనిషి శరీరంలో ఎంత నీరు ఉంటుంది? రోజూ ఎంత నీరు తీసుకోవాలో ఎలా తెలుతుంది? దీనికి శరీర ధర్మ శాస్త్రవేత్తలు సమాధానాలు చెప్పే ఉంచారు.

సాధారణంగా 75 కిలోల బరువున్న మామూలు వ్యక్తి శరీరంలో 40 నుండి 44 లీటర్ల నీరు వుంటుంది. రక్తపు ప్లాస్మాలో 2-3 లీటర్లు, రక్తంలోని కణాల మధ్య 10 లీటర్లు, కణాల్లో 27 నుండి 30 లీటర్లు నీరు వుంటుంది. అయితే ఈ నీరు స్వచ్ఛంగా ఉండదు. అనేక రకాల శరీర లవణాలతో కలిసి ద్రావకం రూపంలో ఉంటుంది. శరీరంలో నీటి శాతం తగ్గిపోతే శరీర ద్రావకంలో లవణాల సాంద్రత పెరుగుతుంది. అంటే శరీర ద్రావకాల సాంద్రత పెరుగుతుందన్న మాట. నీటి శాతం పెరిగితే శరీర ద్రావకాల సాంద్రత తగ్గుతుంది. శరీరంలోని ఈ ద్రావక సాంద్రతను "బాడీ ఫ్లూయిడ్ ఓస్మోలాలిటీ" అంటారు. సాధారణ స్థితిలో ఓస్మోలాలిటీ కేజీ నీటికి 285 మిల్లిస్మోల్స్ ఉంటుంది. నీటి శాతం తగ్గి రక్తంలో ఓస్మోలాలిటీ పెరిగితే ఈ విషయాన్ని మన మెదడుకు దగ్గరలో ఉన్న హైపోథాలమస్ అనే గ్రంథిలోని 'ఓస్మో రిసెప్టర్లు' గ్రహిస్తాయి. ఈ రిసెప్టర్లు దాహం ఏర్పడేట్లు చేస్తాయి. దాంతో మనం నీళ్లు తాగుతాం. అప్పుడు నీటి శాతం పెరిగి ఓస్మోలాలిటీ సాధారణ స్థితికి వస్తే దాహం తగ్గిపోతుంది. ఒకవేళ ఎక్కువ నీరు తీసుకుంటే రక్తంలో ఓస్మోలాలిటీ తగ్గిపోతుంది. అప్పుడు పిట్యుటరీ గ్రంథి ఎడిహెచ్ (యాంటీ డ్యూరెటిక్ హార్మోన్) విడుదల చేస్తుంది. ఇది మూత్రపిండాల పనిని చురుకెక్కిస్తుంది. ఎక్కువ నీటిని మూత్ర పిండాలు బయటకు పంపుతాయి. ఆ విధంగా మన శరీరంలో నీరు ఒక స్థిరమైన పరిమాణంలోనే ఉంటుంది. అలా ఉండాల్సిందే. ఎక్కువ నీరుంటే బయటకు పోతుంది, తక్కువ నీరుంటే దాహం వేస్తుంది. అంతే.

మరి మనం ఎంత నీరు తాగాలో ఎలా నిర్ణయమవుతుంది? అసలు నీరు తాగకుండా జీవించగలమా?

సాధ్యం కాదు. ఎందుకంటే మనం అసలు పనిచేయకుండా ఉన్నా కూడా ప్రతి రోజూ మన శరీరం నుండి కనీసంగా 1200 మిల్లీ లీటర్ల నీరు బయటకు పోతుంది. ఏం పని చేయకున్నా ఊపిరి పీలుస్తాం కనుక దాని ద్వారా కొంత, చర్మం ద్వారా కొంత, మలం, మూత్రం ద్వారా కొంత పోతుంది. ఏ పనీ చేయకపోయినా మనిషి కనీసం రోజుకు 400 మి.లీ మూత్రం పోయాలి. అందువల్ల మంచినీరు తాగకుండా కొన్ని రోజులు మాత్రమే ఎవరైనా జీవించగలరు.

మామూలు దైనందిన కృత్యాలు నిర్వహించేవారి శరీరంలోనుండి ప్రతిరోజూ నీరు కింది విధంగా బయటకు పోతుంది:

శ్వాస ద్వారా - 400 నుండి 500 మి.లీ
చర్మం ద్వారా- 400 నుండి 500 మి.లీ

మలం ద్వారా- 80 నుండి 100 మి.లీ

మూత్రం ద్వారా- 1000 నుండి 1800 మి.లీ (1 నుండి 1.8 లీటర్లు).

అంటే మొత్తం రోజుకు మామూలు వ్యక్తి 1.9 లీటర్ల నుండి 2.9 లీటర్ల నీరు విసర్జిస్తాడన్న మాట. శరీరంలో నుండి బయటకు పోయిన నీరు ఈ విధంగా భర్తీ అవుతుంది:

మంచినీరు తాగడం ద్వారా 1000 నుండి 1800 మి.లీ (1 నుండి 1.8 లీటర్లు)

మనం తినే ఆహారంలోని నీరు 500 మి.లీ.

మనం తినే ఆహారం ఆక్సీకరణం చెందడం ద్వారా శరీరంలోకి విడుదలయ్యే నీరు 300 నుండి 500 మి.లీ

అంటే ప్రతిరోజూ మనం విసర్జించిన మోతాదు నీరు ఈ విధంగా భర్తీ అవుతుందన్న మాట.

శరీరం నుండి విసర్జించబడిన మేర నీరు భర్తీ కాకపోతే ఏమవుతుంది? మొదట దాహం వేస్తుంది. ఉదాహరణకు 70 కిలోల బరువున్న వ్యక్తి శరీరంలో 40 నుండి 44 లీటర్ల నీరుండాలనుకుంటే అంతకన్నా 2శాతం తగ్గితే దాహం వేస్తుంది. 4 శాతం తగ్గితే నోరు, గొంతు ఎండిపోవడం ప్రారంభమవుతుంది. పనిలో చురుకుదనం తగ్గుతుంది. నిర్లిప్తత, మత్తుగా ఉండడం, అసహనం ఆవహిస్తాయి. 8 శాతం తగ్గితే ఉమ్మి రావడం ఆగిపోతుంది. నాలుక వాచిపోతుంది, గొంతు తడారిపోయి మాట రావడం కష్టమవుతుంది. 12 శాతం తగ్గిపోతే అంటే ఉండాల్సిన దానిలో 4.5 నుండి 5 లీటర్ల నీరు తగ్గిపోతే అతను ఇంక వైద్య సహాయం లేకుండా బయటపడలేడు. 20 శాతం నీరు తగ్గిపోతే ప్రాణం పోతుంది.

నీరు ఎక్కువగా తీసుకోడానికి శరీరంలో నీరు తగ్గడమొక్కటే కారణం కాదు. ఒక్కోసారి సాంద్రమైన ఖనిజ లవణాలున్న ద్రావకాలు తాగితే రక్తంలో ఓస్మోలాలిటీ పెరుగుతుంది. అప్పుడు నీరు అధికంగా తీసుకోవాల్సి వస్తుంది. బాగా వ్యాయామం చేస్తే నీటితో పాటు లవణాలు కూడా శరీరం నుండి బయటకు పోతాయి. అలాంటప్పుడు శరీరంలో నీటి ద్రావకపు సాంద్రత సమతుల్యతను కొనసాగించాలంటే మంచినీరు తాగడంతో పాటు, చిటికెడు ఉప్పుకూడా తీసుకోవాల్సి ఉంటుంది.



మరి శరీరంలో నీరు అధికమైతే ఏమవుతుంది?

కావలసిన దానికన్నా ఎక్కువ నీరు తీసుకుంటే హైపోనేట్రిమియా అనే రుగ్మత వస్తుంది. మూత్ర పిండాలు పాడై శరీరంలోని అధిక నీటిని బయటకు పంపలేకపోయినప్పుడూ, లేక తక్కువ సమయంలో ఎక్కువ నీరు గటగటా తాగేసినప్పుడూ శరీరంలో నీటి శాతం పెరిగి, ఫలితంగా ద్రావకం సాంద్రత తగ్గి ఈ రుగ్మత వస్తుంది. రక్త కణాల చుట్టూ ఉన్న ద్రావకం సాంద్రత తక్కువగా ఉన్నందున రక్తకణాల్లోకి నీరు ప్రవేశించి అవి ఉబ్బుతాయి. దాంతో జీవకృత్యాల్లో అపసవ్యత ఏర్పడుతుంది. కళ్లుతిరగడం, వాంతులు రావడం, కండరాలు పట్టేయడం, మరీ తీవ్రమైన కేసుల్లో మరణించడం జరుగుతుంది. 1995 ఫిబ్రవరిలో బ్రిటన్‌లోని డెర్బిలో 20 ఏళ్ల యువకుడు ఒక్కసారిగా 26 గ్లాసుల నీరు తాగడంతో మెదడు దెబ్బతిని మరణించాడు. దీన్ని వాటర్ ఇంటాక్సికేషన్ (నీటి విషం) అంటారు.

'అతి సర్వత్రా వర్జయేత్' అని మన పెద్దలు అందుకే అన్నారు. అతిగా నీరు తాగినా ప్రమాదమేనన్న విషయం గుర్తుంచుకున్నప్పుడు నీటి వైద్యం చిట్కాలు పనిచేయవన్న విషయం మనకు అర్థమవుతుంది. ఆహారం విషయంలో మాదిరిగానే మంచినీటి విషయంలో కూడా శాస్త్రీయ పద్ధతులు అర్థం చేసుకోకపోతే చిట్కా వైద్యం బారినా, చిట్కా వైద్యుల బారినా పడే ప్రమాదం ఉంది. తస్మాత్ జాగ్రత్త! ❄









రోలి రోలిలో...

'పత్ని' నుండి 'ఐమాక్స్' దాకా...!"

డా॥ జె.పి. వైద్య

'ప్రేమ' - ఈ అందమైన రెండు అక్షరాలు 'అక్షరాలా' మన జీవితానికో నిర్వచనం చెప్తూ, మన జీవితాలను శాసిస్తున్నాయి. కర్తవ్యం కారణంగా మనిషి తను చేసే పనిని చక్కగా, పద్ధతిగా చేస్తాడు. అయితే ప్రేమకోసం మటుకు అదే పనిని మరింత అందాలతో, ఆనందంగా చేసి, కృతకృత్యుడవుతాడు.

'ప్రేమ' గురించి రాస్తే ఈ సంచిక, కేవలం 'టైటిల్స్' కే సరిపోతుంది.

'ప్రేమ' లేని ఈ ప్రపంచం మానవతలేని మరుభూమి! ప్రేమమీద గీతాలు వేలల్లో... లక్షల్లో...!

ప్రేమమీద సినిమాలు వేలల్లో... లక్షల్లో...! అందులో వేలకొద్ది అసంపూర్ణంగా 'డబ్బాల్లో నీలుగుతూ, బరువైన గుండెలతో, తడి కళ్ళతో, దుమ్ము కప్పుకొని ఉండొచ్చు!

మనం ఓపిగ్గా దుమ్ము దులిపేస్తూ ఈ పూట మరో దునియాలో కాలిడుతూ తెలుగు సినీ ప్రపంచంలోని అలనాటి సౌందర్య దర్పణంలో 'ఋష్యేంద్రమణి' గారిని తలుచుకుందాం!

మా తరం వెనక వాళ్ళకే ఋష్యేంద్రమణి వయస్సు మళ్ళిన పాత్రలో జ్ఞాపకాల పొరల్లో వుండి ఉంటారు. ఈ తరం 'ఇలియానా', 'త్రిష' దోస్తులకు ఆమె 'హూ వజ్ షీ'?

1938లోనే 'మాలపిల్ల'లో అట్టడుగు కులానికి చెందిన అమ్మాయి బ్రాహ్మణుల అబ్బాయిల ప్రేమ వృత్తాంతాన్ని చూయించే సాహసం చేశారాయన. 1939లో జమిందారీ వ్యవస్థను ఎదుర్కొనే పీడిత తాడిత రైతుల చిత్రణ ఉన్న 'రైతుబిడ్డ' వచ్చింది. అందులో చిరస్మరణీయమైన నటన రాఘవాచార్యది. రైతుపిల్ల టి. సూర్యకుమారి! 'సో వ్వాట్?' అని భృకుటి ముడిచి ప్రశ్నించే సినీప్రియజనులు ఓపిక చేసుకొని, నేషనల్ ఫిల్మ్ అర్కైవ్‌లో భద్రంగా ఉన్న అలనాటి అందాలను ఒక్కసారైనా కళ్ళారా చూసుకోవాలి. 'బ్లాక్ అండ్ వైట్'... ఓల్డ్ ఈజ్ గోల్డ్' జమానా 'ఝుట్కా' లేమిటో తెలిసి వస్తాయి.



'రైతుబిడ్డ'లో ఓ దృశ్యం

కాని, మాతరం వెనక వాళ్ళకూ ఆవిడ 'షీ వజ్ షీ! దట్సాల్'!!

పోల్చుకోవడానికని రాయడం కాదు, కాని, మర్లిన్ మన్రో, ఎలిజబెత్ టేలర్‌లను తలచుకొని 'హూ వజ్ షీ', అంటే అరేరేరే...! ఏం మంది బైసాబ్ వీళ్ళు? ఏం జెన్రల్ నాలేజ్ వీళ్ళది? అని ఒళ్ళు మండే వాళ్ళు ఇంకా ఉన్నారులెండి.

ఒకప్పుడు మిస్సమ్మ, మాయాబజార్, అప్పు చేసి పప్పు కూడు లాంటి 'ఎవర్‌గ్రీన్ శ్వేతశ్యామ తెలుగు చిత్రాల్లో వయస్సు మళ్ళిన పాత్రల్లో నటించిన 'ఋష్యేంద్రమణి' ఒకప్పుడు 'జవాన్ దిలోంకి ధడ్కన్' అంటే 'ఆం...! ఓహో! గట్లనా?' అని భృకుటి బిగించి - యాడికెల్లి తెచ్చినవ్ బిడ్డా గీ ఇన్ఫర్మేషన్? ఇంకెవరు దొరకలేదా?' అని ప్రశ్నించే వాళ్ళు ఉండవచ్చు! బట్! హుకేర్స్‌హూమ్?? ఇవన్నీ నేటికి 73 సంవత్సరాల నాటి ముచ్చట్లు!

చరిత్ర పుటల్లో చిరుగుతున్న బంగారు కాయితాలు అవి!

చాలా జాగ్రత్తగా సుకుమారంగా మసలుకుంటేనే 'జ్ఞాపకాల రెపరెపలు' ఘల్లుఘల్లుమంటూ వచ్చి పలకరించిపోతాయి.

1935లో సి. పుల్లయ్యగారు దర్శకత్వం వహించిన 'శ్రీకృష్ణతులాభారం' చిత్రం ద్వారా 'ఋష్యేంద్రమణి' సినీరంగ ప్రవేశం చేశారు. అదే సంవత్సరం వేల్ పిక్చర్స్ వారి 'శ్రీకృష్ణలీలలు' కూడా విడుదలైంది. ఆ సినిమా దర్శకుడు సి. హెచ్. నరసింహారావుగారు.

'శ్రీకృష్ణలీలలు'లో గగ్గయ్య (జగ్గయ్యగారు కాదు సుమా) గారూ, శ్రీరంజనీ నటించారు. అయితే శ్రీకృష్ణ తులాభారంలోని కృష్ణుడు 'రామనాథ శాస్త్రిగారు, సత్యభామగా వేసినవారు 'ఋష్యేంద్రమణి'.

ఆ రోజుల్లో 'సారథీ బ్యానర్స్'తో సామాజిక సమస్యలను ప్రతిబింబించే చిత్రాలను నిర్మించేవారు. సమాజంలోని సాంప్రదాయక అవలక్షణాలను నిరసించే విప్లవాత్మక దర్శకుల్లో, గూడవల్లి రామబ్రహ్మం' గారు ఆద్యులు.

1938లోనే 'మాలపిల్ల'లో అట్టడుగు కులానికి చెందిన అమ్మాయి బ్రాహ్మణుల అబ్బాయిల ప్రేమ వృత్తాంతాన్ని చూయించే సాహసం చేశారాయన. 1939లో జమిందారీ వ్యవస్థను ఎదుర్కొనే పీడిత తాడిత రైతుల చిత్రణ ఉన్న 'రైతుబిడ్డ' వచ్చింది. అందులో చిరస్మరణీయమైన నటన రాఘవాచార్యది. రైతుపిల్ల టి. సూర్యకుమారి! 'సో వ్వాట్?' అని భృకుటి ముడిచి ప్రశ్నించే సినీప్రియజనులు ఓపిక చేసుకొని, నేషనల్ ఫిల్మ్ అర్కైవ్‌లో భద్రంగా ఉన్న అలనాటి అందాలను ఒక్కసారైనా కళ్ళారా చూసుకోవాలి.

'బ్లాక్ అండ్ వైట్'... ఓల్డ్ ఈజ్ గోల్డ్' జమానా 'ఝుట్కా' లేమిటో తెలిసి వస్తాయి.

గూడవల్లి రామబ్రహ్మంగారు ఎంత వాస్తవవాది అయినా అంతో ఇంతో ఫెమినిస్ట్. అందులో ఏమాత్రమూ అనుమానాలు అక్కర్లేదు. ఏ సినిమా అయినా స్త్రీ శక్తి ఏమిటో జనాలకు అర్థమయ్యేలా చెప్పే ప్రయత్నం చేశారాయన. కృతకృత్యులూ అయ్యారు కూడా! 1941లో కాంచనమాల, ఉమా మహేశ్వరరావు జంటగా 'ఇల్లాలు' చూసినా చాలు... ఆయన 'స్త్రీ శక్తి' తపన సుళువుగా అర్థమవుతుంది. ఆయన అలనాటి విప్లవాత్మక దర్శక మహారాజు. వృద్ధురాలిగా జనం కళ్ళల్లో కన్పించిన 'ఋష్యేంద్రమణి' గారిని 'ఆ! బాపరే...!' అంటూ కళ్ళప్పగించి చూసేలా చూయించిన ఘనత వారిది. తన అందచందాలతో ప్రేక్షకులను కట్టిపారేసిన సినీ చరిత్రలోని వెండితెర 'ముక్క' అందాలకథ ఆమెది!

నల్లని కేశ సంభరాన్ని చూస్తూ - గండుతుమ్మెదల నలుపునే గేలిచేసిన ఇలాంటి శిరోజాలను ఇంతవరకు నేను చూడలేదమ్మా' అని వేనోళ్ళ మనసారా కొనియాడారు దర్శకుడు ముఖర్జీగారు.

ఆరోజుల్లో పొడుగాటి వేషాలు ఫ్యాషన్! సెట్‌లో అందరి

చూపులూ ఆవిడ కేశ సామ్రాజ్యం మీదే 'పిన్‌పాయింట్'గా 'ఫోకస్' అయి ఉండేవి.

'సిలప్పది కారం' అనే సినిమా 'పత్ని' అనే సినిమాకు ఆధారం. హీరో కె.యస్. ప్రకాశ్‌రావుగారు. 'కన్నగి' హీరోయిన్ పేరు. అంటే అది ఋష్యేంద్రమణి గారి పేరన్నమాట. 'పత్ని'లో! ఆ ప్రకాశ్‌రావుగారే తర్వాతిరోజుల్లో దర్శకత్వంతో తృప్తి చెంది 'హీరోయిజా'నికి శాశ్వతంగా 'గుడ్ బై' చెప్పారు.

'మల్లీశ్వరి' విడుదలైన రోజుల్లోనే ఆయన దర్శకత్వంలో సింగారించుకున్న 'మొదటి రాత్రి' - 'దీక్ష' లాంటి సినిమాలు వచ్చాయి. 'పత్ని'లో దాదాగిరి అంతా డామినేటింగ్ స్త్రీ పాత్రదే, కాబట్టి ప్రకాశ్‌రావు గారికి ఎక్కువ స్కోప్ లేకుండా పోయింది.

'పత్ని' పేరుకు తగ్గట్టే మొగుడూ- పెళ్ళాల కథ. అదీ ఆ జమానాలోని కథ.

"రాజుగారి కొలువులో పనిచేసే హీరో రాజనర్తకి వలలో పడతాడు. అతని మీద దొంగతనం అభియోగం మోపబడుతుంది. రాజుగారి ధనాగారంలోంచి ఒక హారం దొంగిలించాడన్నది అభియోగం. భార్య కన్నగి సదరు హారం తనదే అనీ- తన భర్త దొంగిలించలేదనీ సవాల్ చేస్తుంది. రుజువు చేస్తుంది కూడా! అప్పటికే విధించబడ్డ మరణశిక్ష అమలైపోతుంది. నిర్దోషి అయిన తన భర్తను అప్పగించమని 'డిమాండ్'కు రాజు జవాబీయలేక నోరు మూసుకుంటాడు. కన్నగి తన పాతివ్రత్య మహిమలతో పట్టణాన్ని బూడిద చేసిపారేస్తుంది".

ఇదీ టూకీగా చిత్రకథ... తెర నిండా ఋష్యేంద్రమణి వ్యాపించిపోతుంది. రామబ్రహ్మంగారి దగ్గర దర్శకత్వంలో 'ఓ.నా.మా' లు నేర్చుకున్న ప్రకాశ్‌రావుగారు తొలిచిత్రాల్లో దర్శకత్వం 'తడాఖా' చూయించినా తర్వాతి రోజుల్లో 'బందిపోటు దొంగలు' లాంటి 'మాస్ పిక్చర్ల' స్థాయికి జారిపోయారు. సినిమా దునియాలో జారుడు బండలకు కరువు అస్సలే లేదు. సమస్యాత్మక చిత్రాలకు ఆద్యుడు అని 'స్టాంప్' వేసుకున్న గూడవల్లి రామబ్రహ్మం కూడా అఖరాఖర్న 'మాయాలోకం'లాంటి ఫాంటసీ చిత్రాలను తీసే స్థితికి చేరుకున్నారు.

ఆఖరు చిత్రం 'పల్నాటి యుద్ధం' పూర్తి చేయలేకపోయారు. దీన్ని యల్.వి.ప్రసాద్ పూర్తి చేశారు.

ఋష్యేంద్రమణి, కె.ఎస్. రామారావు లాంటి వారిలోని నటనా కౌశలాన్ని వెలికితీసిన మహానుభావుడాయన.

ప్రస్తుతం 'తమిళనాడు ముఖ్యమంత్రి' గారైన యమ్. కరుణానిధిగారు అసలు సిసలు సినిమా మనిషి. నల్లటి కళ్ళద్దాల వెనక అద్భుతమైన కళా సృష్టి ఉన్న పెద్దాయన. 'పత్ని'...ని తమిళ తంబిల కోసం 'పుంపుహార్' పేరుతో అప్పుడెప్పుడో తీశారు.

ఈ సినీముచ్చట్లలో రెండు అంశాలే మనకు ముఖ్యం. ముసలి పాత్రల్లో పరిచయమైన 'పెద్దావిడ' పడుచుపాత్రలో 'అబ్బుబ్బా!' అనేట్టు నటించి, మెప్పించింది.

పెద్దపెద్ద వాళ్ళు ఆఖర్న చిన్నా చితకా అణాబెత్తెడు సినిమాల కోవకు చేరిపోవాల్సి వచ్చింది.

మనం ప్రేక్షక మహారాజులం మటుకు మారలేదు.

మనం అంత 'బిజీ'గా మారం. బేడా అర్ధణా నేల టికెట్ జమానా నుండి 'ఐమాక్స్' జమానా హై-ఫై పచ్చనోటు టికెట్ దాకా' వుయ్ హ్యావ్ రిమైన్డ్ ది సేమ్',

'ఆవారా'.... శ్రీ 420' రాజకపూర్ 'సత్యం శివం సుందరం'లో ఎంత 'సౌందర్యాన్ని' బలికించినా కళ్ళు మూయకుండా కళ్ళకు అద్దాలు తెచ్చుకున్నవాళ్ళం మనమే!

'పత్ని' రోజుల నుండి 'పాండురంగడు' దాకా - 'జల్సా'లు చేస్తూ, 'పరుగు'లు తీస్తూ, 'ఆటాడిస్తూ', బుజ్జిగాడి'లా ప్రేమించే శ్రేయోభిలాషులం' మనమే కదా!

ఎంత 'కంత్రీ కంత్రిగాళ్ళమైనా' సినీరంగానికి అసలు సిసలు పునాదులం, ఆధార స్తంభాలమూ, 'ప్రొక్చర్ బాధితులం మనమే కదా!

మనం మారిపోతే సినిమాలు మారవూ? హూ కేర్స్ హూమ్??

దీనిపై మీ స్పందనను రచయితకు తెలియచేయవచ్చు.
ఫోన్: 08732223622





హిప్నో కమలాకర్
ఫోన్ నెం: 9390044031



ఎప్పుడూ పోట్లాటే

మా అమ్మాయి, అల్లుడు ఎప్పుడూ పోట్లాడుకుంటారు. ఇద్దరూ జాబ్ చేసుకుంటారు. ఎప్పుడూ డబ్బు గురించే గొడవ. దీనివల్ల పిల్లలు ఇబ్బంది పడుతున్నారు. సలహా చెప్పగలరు ?

లక్ష్మి, వైజాగ్

భార్యాభర్తలు ఇద్దరూ ఉద్యోగాలు చేయడంవల్ల ముఖ్యంగా డబ్బు విషయంలో సమస్యలకు దారితీయవచ్చు. సంపాదించిన సొమ్ముని ఎంత మేరకు ఖర్చుపెట్టాలన్నది. వివాహ బంధానికే ఎసరు పెడుతుంది. ఒకరికి తెలియకుండా ఇంకొకరు సొంత ఖర్చులు పెట్టడంలో మూడు ముళ్ళ బంధానికి చిక్కుముళ్ళు పడుతున్నాయి. సంపాదనవల్ల ఆర్థికంగా వస్తున్న బలాన్ని వదులుకోవడానికి ఎవరూ ఇష్టపడడం లేదు. భార్యాభర్తలిద్దరూ కలిసి కూర్చుని ఖర్చుల గురించి మాట్లాడుకోవాలి. కుటుంబ ఖర్చులే కాకుండా వ్యక్తిగత ఖర్చులు కోసం కొంత సొమ్ము వేరుగా ఉంచుకోవాలి. అప్పులు ఉంటే ఎలా తీర్చుకోవాలన్నది ఇద్దరూ చర్చించుకొని నిర్ణయించుకోవాలి. ఖర్చులు, పొదుపులపై స్పష్టమైన నిర్ణయాలు తీసుకోవాలి. నెలవారి ఖర్చుల జాబితాను తయారు చేసుకోవాలి. ఎవరు ఎక్కువ సంపాదిస్తున్నారనే సమస్య రాకూడదు. డబ్బు విషయంలో భార్యాభర్తల మధ్య పరస్పర నమ్మకం, అవగాహన ఉంటే సమస్యలు రావు.

పాప పరిస్థితి అర్థం కావట్లేదు

మా పాప వయస్సు 20 సంవత్సరాలు. దగ్గర బంధువులబ్బాయిని ఇంట్లో ఉంచుకున్నాము. అతను పాపపై అత్యాచారం చేశాడు. అప్పటినుండి మగవాళ్లను చూస్తే భయపడి ముడుచుకుపోతోంది. ఎవరేమీ అనకపోయినా గొడవ పెట్టుకుంటుంది. అర్థంపర్థం లేకుండా ఆవేశపడుతుంది. నిద్రలో హఠాత్తుగా లేస్తోంది. శరీరం మీద పాములు పాకుతున్నాయంటుంది. మోకాళ్ళ మధ్య తల దాచుకొని కుమిలి కుమిలి ఏడుస్తోంది. ఏం చెయ్యాలో తోచడం లేదు?

- రేష్మ, భీమవరం

స్త్రీ జీవితాన్ని భౌతికంగానూ, మానసికంగానూ, అతలాకుతలం చేసే సంఘటన అత్యాచారం. మన దేశంలో ప్రతి గంటకు ఒక మహిళ బాధితురాలవుతుంది. కుటుంబ గౌరవం, పరువు ప్రతిష్ఠలవల్ల ఫిర్యాదు చేయని కారణంగా నేరస్థులు తప్పించుకుని తిరుగుతున్నారు. సమస్యలు పెరిగిపోతాయి. కొందరిలో ఇవి కొన్నాళ్ళపాటు ఉంటే మరి కొందరిలో చాలాకాలంపాటు ఉండవచ్చు. దీనివలన వైవాహిక జీవితం సమస్యల వలయం అవుతుంది. మగవాడిని అనుమానిస్తూ అసహ్యించుకునే ధోరణి పెరుగుతుంది. లైంగిక జీవితంపట్ల విరక్తి కలుగుతుంది. అందరూ అనే మాటలు స్త్రీని మరింత కుంగిపోయేలా చేస్తాయి. దోషుల్ని శిక్షించినంత మాత్రన స్త్రీకి ఊరట లభిస్తుందని చెప్పలేం. కాలేజీకి పంపించండి. కొత్త ప్రదేశాలకు తీసుకెళ్లండి. పనులు చేయించండి. ఒంటరిగా వదలకండి. జీవితం ఎంతో ఉందన్న విషయాన్ని

తెలియజేయండి. తల్లిదండ్రులుగా మీ ప్రోత్సాహం ఆ అమ్మాయికి "కొండంత" అండగా నిలుస్తుంది. కౌన్సిలింగ్ ద్వారా సాధారణ స్థితికి తీసుకురావచ్చు. కౌన్సిలింగ్ సైకాలజిస్ట్‌ని కలవండి.

ఒకటే గడబిడ

నాకు 20 సంవత్సరాలు. కడుపులో ఎప్పుడూ గడబిడగా ఉంటుంది. ఒక్కోసారి కడుపులో పట్టేసినట్లు నొప్పిగా ఉంటుంది. కొన్ని సార్లు పల్చగా విరేచనాలవుతాయి. ఎంతోమంది దాక్టర్లకు చూపించుకున్నాను. డబ్బు ఖర్చయ్యింది. బాధ పెరిగింది. ఏమి లేదంటున్నారు. సలహా ఇవ్వగలరు?

- అపర్ణ, కోదాడ.

మీ సమస్యను "ఇర్రిటబుల్ బవెల్ సిండ్రోమ్" అంటారు. ఈ వ్యాధికి ముఖ్య కారణం మానసిక సమస్యలు. ఈ వ్యాధి యుక్త వయసులో మానసిక ఆందోళన వలన వస్తుంది. ఒత్తిడి ఎక్కువై యాంగ్జైటీ డిప్రెషన్‌కు గురవ్వడం వలన పేగుల కదలికలో మార్పులు కలిగి ఈ సమస్య వస్తుంది. మనసు, శరీరం ఒకదానిమీద ఒకటి ఆధారపడి ఉంటాయి. మనసు స్థిమితంగా లేనప్పుడు శరీరం అనారోగ్యం పాలౌతుంది. ఈ సమస్య ఉన్నప్పుడు ఆందోళనతో చిన్న చిన్న విషయాలకు కోపం వస్తుంది. మీలో మానసిక సమస్యలు, ఒత్తిడులు వున్నాయేమో గుర్తించండి. ఆ ఒత్తిడిని తగ్గించుకోవాలి. కౌన్సిలింగ్ సైకాలజిస్ట్‌ను కలవండి. నిద్ర రావడానికి బ్రీతింగ్ ఎక్సర్‌సైజులు చేయండి. కౌన్సిలింగ్‌లో సైకోథెరపి, బిహేవియర్ థెరపి ద్వారా మీలో మార్పురావచ్చు.



ఏ పనీ చేయనంటే ఎట్లా!

నేను డిగ్రీ చదివాను. చిన్న చిన్న పనులు చేయడం ఇష్టంలేదు. ఇంట్లో వాళ్ళు ఏ పనీ చేయడం లేదని తిడుతున్నారు. నేను వాళ్ళు చెప్పినట్లు చెయాలా? నాకు ఏమి అర్థం కావడం లేదు. మాది మధ్య తరగతి కుటుంబం.!

- రామకృష్ణ, పాలకొల్లు

నీవు ఎంచుకున్న మార్గం చిన్నదయినా సరిగ్గా లేకపోతే ముళ్ళ దారవుతుంది. అదే మంచిదయితే పూలబాట అవుతుంది. నీవు ఎంత చిన్న పని చేస్తున్నావు అని కాకుండా నీకు అప్పగించిన... నీవు ఎంచుకున్న పనిని ఎంత చక్కగా నిర్వర్తిస్తున్నావనే అంశమే నీ భవితను



నిర్దేశిస్తుంది. కొంత మంది తమంత తాముగా ఎంపిక చేసుకున్న రంగంలో నిలదొక్కుకుని అనతి కాలంలోనే ఉన్నత శిఖరాలు అధిరోహిస్తే అది ఆ వ్యక్తికే కాదు.. ఆ కుటుంబం మొత్తానికి, ఇతరులకు స్ఫూర్తినిస్తుంది. ఖాళీగా ఉంటే మెదడు, శరీరం ఎందుకూ పనికి రాకుండా పోతాయి. కాబట్టి వెంటనే చిన్న పని అయినా చేయడం మొదలు పెట్టు. అలా పని చేస్తూ.. పి.జి ప్రయివేటుగా చదువుకో. అప్పుడు నీవు అనుకున్న విధంగా చక్కని పొజిషన్‌కి వెళ్లగలవు. ❋

రుచి

తోటకూర వేపుడు

కావలసిన వస్తువులు

తోటకూర కట్టలు (లేతవి) అయిదారు
ఎండు మిర్చి - 9
నూనె - చిన్న గిన్నెడు
పోపు సామాను - కరివేపాకు
పచ్చిమిర్చి - 4
పెద్ద ఉల్లిపాయ - 1
ఉప్పు - సరిపడా

తయారు చేసే విధానం

ముందుగా తోటకూర శుభ్రంగా కడిగి ఆరబెట్టుకోవాలి. ఉల్లిపాయ చిన్న చిన్న ముక్కలుగా తరగాలి. తోటకూర కూడా సన్నగా తరిగి పక్కన పెట్టుకోవాలి. అలాగే పచ్చిమిర్చి కూడా సన్నగా తరగాలి.

బాండీ పొయ్యిమీద పెట్టి కాలిన తరువాత నూనె పోసి కాగనివ్వాలి. తరువాత ఎండుమిర్చి ముక్కలుగా తుంచి వేయాలి. ఇవి బాగా కాలిన తరువాత పోపు గింజలు వేసి చిటపటలాడాక కరివేపాకు వేయాలి. తరువాత ఉల్లి ముక్కలు వేసి కాస్త వేగనివ్వాలి. ఆ తర్వాత పచ్చిమిర్చి, తోటకూర వేసి బాగా వేగనివ్వాలి. కాస్త వేగిన తరువాత సరిపడా ఉప్పు వేసి ఇంకొంచెం సేపు వేగనిచ్చి తీసుకోవాలి. కొబ్బరి ఉన్నట్టయితే మెత్తగా తురిమి తోటకూర వేయించేటప్పుడు వేసి కలియబెట్టి వేయించుకుంటే మరికాస్త రుచిగా ఉంటుంది.



దోసకాయ పచ్చడి

కావలసిన వస్తువులు

దోసకాయలు - 1/4 కిలో
ఉల్లిపాయ- ఒకటి
అల్లం - చిన్న ముక్క
ఉప్పు - తగినంత
జీలకర్ర - టీ స్పూను
వెల్లుల్లి గర్భాలు -2
పచ్చి మిరపకాయలు - 10
చింతపండు - కొంచెం
నూనె -చిన్న గిన్నెడు
పోపు సామాను - కరివేపాకు

తయారుచేసే విధానం

దోసకాయ ముందుగా పెచ్చు తీసి సన్నగా ముక్కలు తరగాలి. ఉల్లిపాయ కూడా సన్నగా ముక్కలు తరిగి పక్కన పెట్టుకోవాలి. పచ్చిమిరపకాయలు, చింతపండు, వెల్లుల్లి గర్భాలు, జీలకర్ర, ఉప్పు వేసి మెత్తగా నూరుకోవాలి. తర్వాత ఉల్లి, దోసకాయ ముక్కలు వేసి కచ్చాపచ్చాగా నూరుకొని పోపు వేసుకోవాలి.





వెన్నఉండలు

కావలసిన వస్తువులు

బొంబాయి రవ్వ - 1 కిలో
సోడా - 1 స్పూను
వాము - రెండు స్పూన్లు
ఉప్పు, కారం - తగినంత
నెయ్యి లేక డాల్డా - కప్పు

తయారు చేసే విధానం

బొంబాయి రవ్వ జల్లించుకొని ఉప్పు, సోడా, కారం, కలిపిన వాము, నెయ్యి, నీళ్ళు పోసి పూరీల పిండిలాగా కలిపి ఒక గంటసేపు బాగా నాననివ్వాలి. నానిన తరువాత చిన్న చిన్న ఉండలుగా చేసుకొని పొయ్యి మీద బాండీ పెట్టి నూనె పోసి కాగిన తరువాత ఉండలను కొంచెం ఎర్రగా వేపుకొని తీసుకోవాలి.



క్యారెట్ ఖీర్

కావలసిన వస్తువులు

క్యారెట్లు - 1/2 కిలో
యాలకులు - 10
పంచదార - సరిపడా (తీపి మీ ఇష్టం)
వెనిల్లా ఎసెన్సు - 1 టేబుల్ స్పూను

తయారు చేసే విధానం

ముందుగా క్యారెట్లు శుభ్రంగా కడిగి కుక్కరులో పెట్టి ఉడికించాలి. తరువాత ఈ దుంపలపైపొట్టు తీసివేయాలి. దుంప మధ్యలో ఉన్న మెత్తటి పదార్థం కూడా తీసేసి ఈ క్యారెట్ దుంపలను, యాలుకగింజలను కలిపి గుజ్జులాగా మిక్సీలో వేసి ఒక ప్లాస్టిక్ డబ్బాలో పెట్టి ఫ్రిజ్‌లో పెట్టుకోవాలి. వాడుకునేటప్పుడు సగం గ్లాసు నీరు, సగం గ్లాసు పాలు కలిపి 1 1/2 టీ స్పూను క్యారెట్ గుజ్జును కూడా వేసి రెండు గ్లాసుల్లోకి నురగ వచ్చేలా కలపాలి. ఒక ఐస్ క్యూబ్ వేసుకుని చల్లగా తాగితే బాగుంటుంది.

+++

కథా నిలయం

ఆణిముత్యాల్లాంటి భావాలు!

మంచి పుస్తకం విందు భోజనం లాంటిది. వండి వడ్డించే పని చేయి తిరిగిన రచయితలు చేస్తే, సుష్టుగా ఆరగించే పని పాఠకులది. 'తల్లీ.... నిన్ను దలంచి పుస్తకం చేతన్ బూనితిన్' అని చదువుల తల్లి సరస్వతిని ప్రార్థిస్తాం. కొన్ని పుస్తకాలు ఓపికతో చదువుతాము. కొన్ని వదిలేస్తాం.

అలా వదిలివేయబడ్డాయి కొన్ని మంచి మాటలు. అలాంటి మంచి మాటలను, కథలను, గేయాలను, వ్యాసాలను, చిన్న చిన్న ఉపదేశాలుగా ఎంతో ఓపికతో 'కూర్పు'లా గ్రంథాలయంలో అంటించి, అందరూ చదవాలనే అభిలషించడం అపూర్వం, అద్భుతం, గొప్ప పని.

ఆ పని 'సరూర్‌నగర్' శాఖ గ్రంథాలయంలో జరిగింది.

మంచి మాటల మూటలు 'మేధస్సు'ను వ్యాపింప చేస్తాయి. చదివించేలా చేస్తాయి.

అత్యంత సుందరమైన, అద్భుత గమ్యాన్ని చేర్చే, అందమైన భావలహరులు నిండి ఉన్న పుస్తకం 'బాట'!

• విడిగా చూస్తే నీటి బిందువులు అతి సామాన్యమైన 'అల్ప ప్రాణులు' అవే మహాసాగరాన్ని సృష్టిస్తాయి. అందమైన అలలనూ సృష్టిస్తాయి. మనం ఒడ్డుమీద కూర్చుండి 'సాహిత్యం అందాలను' ఓపిక చేసుకొని ఆస్వాదించాలి.

కొన్ని అందాలను గమనించండి. చాలా బావుంటాయి. మనస్సుకు హత్తుకుంటాయి.

'ఏ నాగరికతకైనా ప్రథమ దైవం సూర్యుడు. మనం నిద్ర పోయినా మనలో అతడు మేల్కొని ఉంటాడు. అగ్నే, త్వం సుజాగృహివయం సుమందిశీమహి' అని శృతి గీతాలున్నాయి.

'శబరీ గోదావరి నదుల సంగమ స్థలం... యుద్ధానికీ, మానవత్వానికీ మూలాలు మనలోనే ఉన్నాయి' అని చెప్పే ప్రయత్నం.

'సాధనమున పనులు సమకూరు ధరలోన' అనే వాక్యానికి ఈ తరం రూపకల్పనగా చూసి ధన్యమైన 'సుబ్బలక్ష్మి' గారి గాత్ర మాధురీ వర్ణన ఉన్న రెండు పేజీలు....

'ఫ్లోరోసిస్ బాధితుల కోసం' రెండు పేజీల్లో ప్రాక్టికల్ చిట్కాలు...

'పిల్లలకు బోధన చేసే ఉపాధ్యాయులు గమనించాల్సిన విషయాలు....'

'సినారే కవితలు అందాలు'....

'తెలుగులో కాలం కథ'.... 'కుందేలు తాబేలు కథలోని నూతనమైన అంశాలు....'..... 'కవుల కలలు'... 'కాయితాల పడవలు'....'రంగుల పరిచయ వాక్యాలు'.... ఒకటా? రెండా? 108 పుస్తకాల్లోంచి ఏరి తీసిన ఆణిముత్యాల్లాంటి భావాల సుమహారాలున్నాయి 232 పేజీల నిండా! ప్రపంచానికి తొలి'కారు'ను అందించిన 'హెన్రీ ఫోర్డ్'ను ఎవరో అడిగారు.

'మీ విజయ రహస్యం ఏమిటి?' అని.

'ఏముందీ! ఒక అవకాశం రాగానే దాని మీదికి దూకి పట్టేసుకుంటాను.

'మరి, అవకాశం ఎప్పుడొచ్చేదీ మీకెలా తెలుస్తుంది?

'నాకు తెలీదు.. అందుకే ఎప్పుడూ దూకుతూనే ఉంటాను. అవకాశాలు అందరికీ వస్తూనే ఉన్నా, వాటిని గుర్తించి, వాడుకోగల్గటమే విజయ రహస్యం మరి!

పుస్తకాల కోసం లైబ్రరీలో గంటలు గడిపే ఓపిక లేని వాళ్ళు, ఓపిక చేసుకొని కనీసం ఈ 232 పేజీలు చదివినా చాలు... లైబ్రరీకి వెళ్ళి, పుస్తకాలతో 'దోస్తీ' చెయ్యాలని తప్పకుండా అనిపిస్తుంది.

బాట

(వివిధ భావాల సంకలనం)

కూర్పు: ద్విభాష్యం వేంకట రామకృష్ణ శాస్త్రి)

పేజీలు: 232, వెల: 100/-

ప్రతులకు: 'ఆనంద సాహితి', 201,ఎస్వీ నివాస్, శ్రీ వెంకటేశ్వర కాలనీ, రోడ్ నెంబర్: 15, సరూర్ నగర్- హైదరాబాద్.

డా॥ జె.పి. వైద్య

జనరల్ నాలెడ్జ్ & క్విజ్

నేలంటి మధు

వెల:40/-

పేజీలు : 122,

ప్రతులకు : ప్రజాశక్తి బుక్‌హౌజ్, 1/1/187/1/2, చిక్కడపల్లి, హైదరాబాద్-20.

ఫోన్: 27660013.

వృత్తి

రావులపల్లి సునీత

వెల:50/-

పేజీలు : 146,

ప్రతులకు : సోల్ డిస్ట్రిబ్యూటర్స్, విశాలాంధ్ర, అబిడ్స్, హైదరాబాద్-001.

M.S.OFFICE

G.Ramu, A.Ravikiran.

Rate:150/- Pages:164

Copies : Sri Balaji Publications, 33-3-31, Ramanayudu Street Vijayawada-002.

హితుడా! ఓ రహస్య స్నేహితుడా!

కె.ప్రవీణ్‌రెడ్డి

వెల:60/-

పేజీలు : 187,

ప్రతులకు : సోల్ డిస్ట్రిబ్యూటర్స్, విశాలాంధ్ర, అబిడ్స్, హైదరాబాద్-001.

మేమూ బొమ్మలేస్తాం

ఏంటలా ఉలుకూ పలుకూ లేకుండా బొమ్మల్లా వుండిపోయారు! మమ్మల్ని చూశా!! సరి సరి. మాకేం తక్కువండీ... మీ రేంజ్‌లో కాకపోయినా ఏదో ఎంత చెట్టుకి అంత గాలన్నట్టు... మా రేంజ్‌లో మేం బొమ్మలేశాం. చూశారుగా మేం సృజించిన కళాఖండాలు. అదుర్స్ కదూ. అసలు మేం బ్రష్షు పట్టుకోవడమే గొప్ప విషయం. ఇంక ఎలాంటి బొమ్మ గీశాం? అది బావుందా లేదా? అనేది తర్వాతి విషయం. కాకపోతే మేం ఈ మాత్రం బొమ్మలేయడానికిగాను మాకు శిక్షణ ఇచ్చిన వారిని మీరు చాలా చాలా అభినందించాలి. మరి మీరు ఆశ్చర్యపోవడం కట్టిపెట్టి ఆ పనిలో వుంటే బెటరుకదా.



చిత్రపటం

ఆదిత్యవర్మ బాగా ధనవంతుడు. కానీ పరమ పిసినారి. డబ్బంతా బీరువాల్లో దాచిపెట్టుకొని ప్రతి రోజూ చూసుకుని సంతోషించేవాడు. పైసా ఖర్చు చేయాలన్నా గొంతు పట్టుకునేది. అందుకే అతన్ని పిసినారి వర్మ అని కూడా అనేవారు.

ఎంత పిసినారైనా అతనూ మనిషే కదా. అతనికీ తీరని కోరిక ఒకటుంది. ఓ గొప్ప చిత్రకారుడితో తన చిత్ర పటం వేయించుకోవాలన్నదే ఆ కోరిక. అయితే ఎప్పుడూ బయటపడేవాడు కాదు. చిత్రకారుడికి డబ్బులు ఇవ్వాలి కదా. అలా డబ్బు ఖర్చు చేయడం అతనికి ఇష్టముండదు. దాంతో తన చిత్రపటం విషయాన్ని ఎప్పటికప్పుడు వాయిదా వేస్తూ వచ్చాడు.

అనుకోకుండా ఓసారి మాటల మధ్యలో ఈ విషయాన్ని తన మిత్రులతో అన్నాడు. అదే అవకాశం అనుకున్న మిత్రబృందం అతనితో బాగా డబ్బు ఖర్చు పెట్టించాలనుకుంది. మొదట తలా ఒక ఉచిత సలహా పడేశారు. అయితే చివరికి అందరూ కలిసి ఒక నిర్ణయానికి వచ్చారు. ఆ పట్టణంలోకెల్లా మంచి పేరు ప్రఖ్యాతులున్న చిత్రకారుణ్ణి పిలిపిద్దామనుకున్నారు. కబురు పెట్టారు. అతడు సరంజామా అంతా తీసుకొని వచ్చాడు. ఎంతో ఆసక్తిగా ఆదిత్యవర్మ ముందు కూర్చుని... ఆయననే చూస్తూ... చక్కటి వర్ణచిత్రం గీశాడు. ఆ చిత్రం చూస్తే అచ్చంగా వర్మను చూచినట్టే వుంది. అందుకు చిత్రకారుడు ఎంతో సంతోషించాడు. ఆ పటాన్ని చూచిన వారంతా అదే అన్నారు. చివరకు వర్మకు కూడా అదే అనిపించింది. కానీ ఆయనలో ఏదో అసంతృప్తి. ఏదో బాధ. ఎందుకంటే చిత్రపటం బావుందని చెప్తే... అతనికి ఎక్కువ డబ్బులు ముట్టచెప్పాల్సి వుంటుంది. అదే బాలేదంటే... ఏదో కొద్దిమొత్తంతో సరిపుచ్చవచ్చనుకున్నాడు. అదే అన్నాడతనితో.

"ఏమయ్యా! నువ్వు ఏదో పేద్ద చిత్రకారుడవని పిలిపించానే. ఇదేనా నీ పనితనం. నాకేం నచ్చలేదయ్యా. పైగా నువ్వు బొమ్మ వేసినంత సేపూ నీ ఎదురుగా కూర్చోలేక చచ్చాననుకో...".

ఆ మాటలకు చిత్రకారుడు నీరసపడిపోయాడు. అతను అంత వరకు ఎంతో మంది బొమ్మలు వేశాడుగానీ ఎవరూ అలా మాట్లాడలేదు. తను ఎంతో బాగా వేస్తానన్న విషయం అతనికీ తెలుసు. కొద్ది సేపు ఆలోచించుకొని...

"పోనీ మళ్లీ వెయ్యమంటారా వర్మగారూ!" అనడిగాడు.

తన మాటలు అత్తణ్ణి బాధించి చిన్నబుచ్చుకుని వెళ్లిపోతాడనుకొంటే ఇలా అంటున్నాడేంటి? అనుకొన్నా... "సరిసరి. రేపు మాత్రం బాగా వేయాలి సుమా" అన్నాడు వర్మ.

సరేనంటూ అతను వెళ్లిపోయాడు.

* * *

మరునాడు చిత్రకారుడు మళ్లీ వచ్చాడు. వర్మ ముందు కూర్చుని మొదటిరోజు కంటే శ్రద్ధగా చిత్రపటాన్ని వేశాడు. వాస్తవ రూపానికి బాగా దగ్గరగా వచ్చినట్టనిపించింది. కష్టపడ్డా ఫలితం కనిపించినందుకు, అది తనకు తృప్తినిచ్చినందుకు అతను ఎంతో సంతోషించాడు. వర్మకోసం చూస్తే అతను లేడు. కాసేపటికి లోపలినుంచి వస్తూ కనిపించాడు. తల వెంట్రుకలు బాగా రేగి వున్నాయి. పై పంచె మార్చాడు. "ఇదేంటి? ఇందాక బొమ్మ వేసినప్పుడు వేరే రీతిగా వున్నాడు. ఇప్పుడు వేరేలా వున్నాడు...." అనుకుంటుండగా..

"ఏది! నువ్వు వేసిన నా చిత్రపటం?" అని అడిగి మరీ చూసి...పెదవి విరిచాడు.

"చూడు! నా తల వెంట్రుకలు ఒకలా వున్నాయి. నీవు గీసిన వెంట్రుకలు మరోలా వున్నాయి. అలాగే పైపంచెలో కూడా మార్పు వుంది...గమనించావా!" అనడిగాడు.

అంటే అతనికి తను గీసిన బొమ్మ నచ్చలేదని చెప్పడం కోసమే లోపలికి వెళ్లి అలా అవతారం మార్చుకొచ్చాడన్నమాట అనుకున్నాడు చిత్రకారుడు. ఇలా రెండు మూడు రోజులపాటు జరిగింది. దాంతో సహనం నశించిన చిత్రకారుడు పట్టణ న్యాయాధికారి దగ్గరకు వెళ్లి గోడంతా వెళ్లబోసుకున్నాడు. దానికి ఆయన

"అతనికి బుద్ధి రావాలంటే... నువ్వు రేపు వాళ్ల ఇంటికి వెళ్లేటప్పుడు నీ వెంట ఒక అద్దం తీసుకెళ్లు. అతని ముందు కూర్చుని బొమ్మ వేస్తున్నట్టు నటించు. చాలా సేపటి తర్వాత అతనికి అద్దం చూపించు. అదే అతని చిత్రం అని చెప్పు" అని సలహా ఇచ్చాడు.

న్యాయాధికారి చెప్పినట్టే చేశాడు చిత్రకారుడు. పైగా ఆ సమయానికి అతని స్నేహితులు కూడా అక్కడే వున్నారు. వారంతా అతని సమయస్ఫూర్తికి మెచ్చుకొని

"చూశావా వర్మా! అతను పేదవాడు. ఏదో బొమ్మలు వేసుకుని బతికేవాడు. అతనితో నీ చిత్రం వేయించుకొని పైకం ఇవ్వడానికే నిరాకరించావు. అందుకే అతను తెలివిగా నీకు నీ చిత్రపటం వేయించుకొనే స్థాయిలేదని .. అద్దం చూపించడం ద్వారా చెప్పాడు. ఇప్పటికైనా బుద్ధి తెచ్చుకుని అతనికి ఇవ్వవలసిన దానికి రెట్టింపు డబ్బులు ఇచ్చి పంపించు" అన్నారు.

అప్పుడు వర్మకి తను చేసిన తప్పేంటో తెలిసి వచ్చి "నేను చేయించుకున్న పనికి డబ్బులివ్వడానికి కూడా పిసినారితనం చూపించాను. అందుకు నన్ను క్షమించు. నీకు రావలసిన పైకం మొత్తం ఇచ్చేస్తాను. పట్టుకెళ్లు" అంటూ లోపలికెళ్లి డబ్బు తెచ్చిచ్చాడు. చిత్రకారుడు సంతోషంగా వెళ్లిపోయాడు.

\- సాహిల్. కె